ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

బాపట్ల జిల్లా వార్తలు


ఆదివారం 2 మార్చి 2025



వినుకొండలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

నీటి పథకాలకు.. నిధులు

"మున్సిపల్ పట్టణాల్లోని ప్రజలకు తాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరిపోను న్నాయి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన తాగునీటి పథకాల పనులు ఎట్టకేలకు పట్టాలెక్కనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రజలకు నీటి ఇబ్బందులు తీర్చాలని నిర్ణయించి ఆసియా మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు(ఏఐఐబీ) నిధులతో రాబేయే 33 సంవత్సరాల జనాభా సంఖ్యను దృష్టిలో పెట్టుకుని తాగునీటి పథకాలను చేపట్టిం ది. వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వాడేసుకుని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో అధికా రం చేపట్టిన కూటమి ప్రభుత్వం తిరిగి ఆ పనులపై దృష్టి సారించింది. అయితే ఏఐఐబీ ఒప్పంద గడువు ముగిసింది. దీంతో ఏఐఐబీని రద్దు చేసి ఆ స్థానంలో అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్టర్ డెవలప్‌మెంట్ ఫండ్(యుఐడీఎఫ్) అమలుకు సిద్ధమైంది. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని తాగునీటి పథకాలకు రూ.961.37 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులు చేపట్టాలని పబ్లిక్‌హెల్త్ శాఖను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిం చింది. దీంతో త్వరలో ఆయా మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి పథకాలు ప్రారంభం కానున్నాయి."



పిడుగురాళ్లలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

- రూ.961.37 కోట్లు మంజూరు
- గడువు ముగియడంతో ఏఐఐబీ రద్దు
- యుఐడీఎఫ్ పథకంలో పథకాల విస్తరణకు చర్యలు
- వైసీపీ హయాంలో నిలిచిన పనులు ఎట్టకేలకు ప్రారంభం
- పురపాలక సంఘాల్లో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

వైసీపీ నిర్లక్ష్యం.. కూటమి శ్రద్ధ

టీడీపీ హయాంలో జరిగిన ఒప్పందం మేరకు తాగునీటి పథకాల విస్తరణకు ఏఐఐబీ నుంచి విడుదలైన నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. అయితే అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వాటా ధనం విడుదల చేయలేదు. పైగా ఏఐఐబీ నిధులను వాడేసుకుంది. దీంతో తాగునీటి పథకాల విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఐదేళ్లు తాగునీటి పథకాలపై కనీసంగా కూడా దృష్టి సారించకుండా నిర్లక్ష్యం వహించింది. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు తాగునీటి పథకాల విస్తరణ పనులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. నిలిచిన పనుల స్థితిగతులు.. వ్యయ అంచనాలను తాజాగా రూపొందించిన ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను విడుదల చేసింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో తాగునీటి పథకాలపై అలుముకున్న నీలినీడలు తొలగిపోతున్నాయి. వైసీపీ హయాంలో నిలిపివేసిన నీటి పథకాల పనులను పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిలిచిపోయిన నీటి పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తాజాగా రూ.961.37 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడువు పూర్తవడంతో ఏఐఐబీను రద్దు చేసి దీనిస్థానంలో అర్బన్ యుఐడీఎఫ్ పథకా న్ని అమల్లోకి తీసుకొచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించగా.. కూటమి ప్రభుత్వం ఇబ్బందులను తీర్చేందుకు దృష్టి పెట్టడంపై ఆయా పట్టణాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏఐఐబీ నిధులతో వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, గుంటూరు కార్పొరేషన్, మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి మున్సిపాల్టీలలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాల విస్తరణ చేపట్టింది. రానున్న 33 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసి ఆయా మున్సిపాల్టీల్లోని నీటి పథ కాల ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఏఐఐబీ రుణం 70 శాతం

(మిగతా 8వ పేజీలో)

మునిసిపాల్టీ	నిధులు (రూ. కోట్లలో)
పిడుగురాళ్ల	155.85
మాచర్ల	95.91
వినుకొండ	184.51
గుంటూరు	186.82
మంగళగిరి	105.79
తాడేపల్లి	146.44
అద్దంకి	86.05

వాటర్ గ్రిడ్ సాధ్యంకాకే..

గుంటూరు, పల్నాడు బాపట్ల జిల్లాల్లోని పల్లెలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు వాటర్‌గ్రిడ్ ద్వారా నీటిని సరఫరాకు ప్రభుత్వం కసరత్తు చేసింది. అయితే కొన్ని మున్సిపాలిటీల్లో వాటర్‌గ్రిడ్ సాధ్యం కాదని ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల తేల్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుఐడీఎఫ్‌ను అమలు చేస్తోంది. మిగతా మున్సిపాల్టీల్లో అమృత్ 2.0 పథకం కింద నీటి పథకాలను విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అటు అమృత్.. ఇటు యుఐడీఎఫ్ పథకాలతో ముడు జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీలలో నీటి పథకాలకు మహర్దశ పట్టనుంది.



బాపట్ల జూనియర్ కళాశాల కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఆర్డీవో గ్లోరియా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


- జిల్లాలో 430 మంది విద్యార్థులు గైర్హాజరు
- బాపట్ల కళాశాల కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శనివారం ప్రారంభమయ్యాయి. 36 కేంద్రాలను ఏర్పాటు చేయగా అవకతవకలకు అవకాశం లేకుండా ప్రతి కేంద్రంలో సీసీ కెమేరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పట్టణంలోని బాపట్ల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జె.వెంకటమురళి తనిఖీ చేశారు. కేంద్రంలోని గదులను కలియ తిరిగి పరీక్షల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంలో 357మంది విద్యార్థులకు 349 మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 36 కేంద్రాలలో 10,357 మందికి 9,927 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని కలెక్టర్ చెప్పారు. 430 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అధికారులు పగడ్బందీగా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, ప్రధానాచార్యులు జి.కోటేశ్వరరావు, సీఎస్‌టీ భవానీ తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి వారబందీ

నేటి నుంచి జోన్-1కు నీటి సరఫరా బంద్

నరసరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో ఆదివారం నుంచి వారబందీ అమలు కానున్నది. జోన్-1 పరిధి కాల్వలకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నారు. జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో జలవనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఉన్న నీటిని సర్ది వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తిరిగి 8వ తేదీ నుంచి నీటి సరఫరా చేయనున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. 9 రోజుల పాటు నీటి సరఫరా ఉంటుంది. తదుపరి ఆరు రోజులు నీటి సరఫరాను నిలిపివేస్తారు. వారబందీ అమలుపై వరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారబందీ విధానంలో మార్చి 31 వరకు పంటలకు నీటి సరఫరా చేయనున్నట్లు జలవనరుల శాఖ ఈఈ కృష్ణమోహన్ తెలిపారు. సాగర్ నుంచి కుడి కాల్వ నీటి సరఫరాను 5 వేల క్యూసెక్కులకు తగ్గించారు. సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 167.17 టీఎంసీల నీటి నిల్వ ఉంది



నాగార్జున సాగర్ జలాశయంలో తగ్గిన నీటి నిల్వ

8 వెటర్నరీ విద్యార్థులపై వివక్ష

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.28 (ఆదివారం)
సహరి : 5.11 (సోమవారం)

చెల్లని ఓట్లపై అభ్యర్థుల్లో గుబులు

- గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 10,576 లెక్కింపునకు తిరస్కరణ
- ఈ దఫా ఎక్కువ శాతం పెరిగే అవకాశం

8

డ్వాక్రా @ ఈ-కామర్స్

- ఈ-వ్యాపారంలోకి మహిళల రంగప్రవేశం
- ఆన్‌లైన్‌లో 1050 ఉత్పత్తుల వివరాలు లభ్యం
- ఇప్పటికే 2,800 మంది ఎంటర్‌ప్రెన్యూర్లుగా నమోదు
- ప్రైవేటు ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం
- మూడు జిల్లాల్లో పలు దఫాలుగా అవగాహన సదస్సులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మహిళల స్వయం సాధికారతే లక్ష్యంగా పురుడు పోసుకున్న డ్వాక్రా సంఘాలు దినదిన ప్రవర్ధ మానంగా ఎదిగాయి. వేల సంఖ్యలో గ్రూపులు, లక్షల్లో సభ్యులుగా మహిళలు స్థానిక వ్యాపారాలతో ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. బ్యాంకులు అందించే రుణాలతో డ్వాక్రా సంఘాలు వారి వారి ఆలోచనలకు తగినట్లు రకరకాల వస్తువులను తయారు చేసి ఎప్పటి నుంచో విక్రయిస్తున్నారు. ఉ మ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా డ్వాక్రా సంఘాలు దాదాపు 1050 రకాలను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో అధికశాతం చేతి వృత్తులే. ఆధునికంగా, ఎంతో నాణ్యతతో కూడిన ఆయా వస్తువుల అమ్మ కాలకు సరైన వేదిక లేదు. దీంతో డ్వాక్రా మహిళలు నష్టాలు చవిచూస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా గ్రూపులను కానీ, వారు తయారు చేసిన వస్తువులకు ఆదరణ కల్పించే కనీస చర్యలు లేవు. ప్రోత్సాహం, ఆదరణ లేకపోవడం.. మరోవైపు విక్రయాలు లేక నష్టాలతో డ్వాక్రా గ్రూపు మహిళలు అయోమయంలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం చంద్రబాబు మానసపుత్రిక అయిన డ్వాక్రా గ్రూపులపై దృష్టి సారించింది. వారి ఉత్పత్తుల అమ్మకాన్ని విస్త్రత పరచడం ద్వారా మహిళలు మరింతగా ఆర్థిక స్థిరత్వం సాధించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుంది. ఈ క్రమంలో డ్వాక్రా మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దడానికి ఉన్న అన్ని అవకాశాలపై కసరత్తు చేసింది. ఇందులోభాగంగా డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలోకి తీసుకురావడం ద్వారా అమ్మకాల విస్తృతిని పెంచడంతో పాటు పెద్దఎత్తున ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. ప్రభుత్వం పరిశ్రమలశాఖ ద్వారా ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ (ఓఎన్‌డీసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. తొలిదశలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 2,800 మంది డ్వాక్రా మహిళలను ఆన్‌లైన్‌లో ఎంటర్‌ప్రెన్యూర్లుగా రిజిస్టర్ చేసే ప్రక్రియను డీఆర్‌డీఏ పూర్తి చేసింది. దశలవారీగా అందరినీ ఈ కామర్స్ గొడుగు కిందకు తెస్తామని డీఆర్‌డీఏ చెబుతోంది. ఇందుకు సంబంధించి డ్వాక్రా సంఘాలకు అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించింది.




ఆన్‌లైన్ ఆర్డర్లకు సంబంధించి డెలివరీకి తినుబండారాలు సిద్ధం చేస్తున్న డ్వాక్రా మహిళలు

డెలివరీ చార్జీలు లేకుండానే..

డ్వాక్రా ఉత్పత్తులకు సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్‌లో అమ్మకాలు కూడా ప్రారంభమయ్యాయి. ఆయా జిల్లాల్లోని వీవోఏలు ఒక్కో గ్రామ సమాఖ్య ద్వారా కనీసం నాలుగు ఉత్పత్తులను ఓఎన్‌డీసీ వెబ్‌సైట్‌లోని మైస్టోర్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దాదాపు 1050 ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వస్తువులు, పచ్చళ్లు, ఇంటి అవసరాలకు పనికొచ్చే సామగ్రి, ఇత్తడి వస్తువులు, చేతి అలంకరణలతో పాటు మరెన్నో ఉత్పత్తులను

(మిగతా 8వ పేజీలో)

అతిపెద్దగా.. ఓఆర్ఆర్



- అమరావతికి మణిహారంగా నిర్మాణం
- 190 కిమీ పొడవు.. 70 మీటర్ల వెడల్పు.. 6 వరసలు
- ఏడు నెలల్లో టెండర్లు.. ఏడాదిలోగా పనులు ప్రారంభం
- మొత్తం ఖర్చు కేంద్రమే భరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక



మంగళగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఔటర్‌రింగురోడ్డు ఏర్పాటుతో ప్రపంచం, దేశంలో చాలా నగరాలు స్వల్ప వ్యవధిలోనే ఎంతగానో అభివృద్ధి చెందాయి. ఈ పరిస్థితుల్లో రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులతోపాటు ఏకకాలంలో ఔటర్‌రింగు రోడ్డును భారీస్థాయిలో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతో ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్ చుట్టూ దేశంలోనే అతిపెద్ద ఔటర్‌రింగురోడ్డును నిర్మించిన చంద్రబాబు.. విభజిత రాష్ట్ర రాజధాని అమరావతి చుట్టూ అంతకన్నా పెద్ద ఔటర్‌రింగు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పైగా రాష్ట్ర ప్రభుత్వానికి నయాపైసా ఖర్చు లేకుండా మొత్తం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. సుమారు 190 కిలోమీటర్ల నిడివిలో ఏర్పాటయ్యే ఈ ఓఆర్ఆర్ 70 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసలతో దేశంలోనే అతిపెద్ద ఓఆర్ఆర్‌గా నిలవబోతుంది. అమరావతికి మణిహారంగా నిలిచే ఓఆర్ఆర్ ప్రాజెక్టును ఏడాదిలోగా పట్టాలెక్కించి ఆపై మూడేళ్లలోగా పూర్తి చేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంగా ఉంది. భూసేకరణ ప్రక్రియను సత్వరమే ప్రారంభించి వచ్చే ఏడు మాసాలలోగా టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ భావిస్తుంది. ఆపై నాలుగైదు మాసాల్లోగా నిర్మాణపనులను మొదలెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓఆర్ఆర్ నిర్మాణానికి సుమారు 4,205 ఎకరాలు అవసరమని ప్రాథమికంగా అంచనా వేస్తుండగా అందులో సుమారు 306 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. దీంతో 3,899 ఎకరాలను సేకరిస్తే సరిపోతుందని భావిస్తున్నారు.

కృష్ణా డెల్టాకు మహర్దశ

అమరావతి ఓఆర్ఆర్‌తోపాటు మరో రెండు లింకురోడ్లను అనుసంధానంగా నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ ప్రతిపాదించింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తున్న విజయవాడ పశ్చిమ బైపాస్‌ను తూర్పుదిశగా సుమారు 17 కిలోమీటర్లు పొడిగిస్తూ ఆరులేన్ల రహదారిని నందివెలుగు వరకు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ సూచించింది. ఈ కొత్త రహదారి విజయవాడ పశ్చిమబైపాస్-ఎన్‌హెచ్-16ని నందివెలుగు వద్ద ఔటర్‌రింగురోడ్డుతో అనుసంధానం చేస్తుంది. ఈ రహదారితో విజయవాడ తూర్పు బైపాస్ రహదారి అవసరం ఉండదని ఎన్‌హెచ్ఏఐ తేల్చిచెప్పింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16తో పశ్చిమ బైపాస్ కలిసే ప్రాంతంలో ఫ్లవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్‌ను సరికొత్తగా నిర్మిస్తారు. ఇక్కడ నుంచి మొదలయ్యే అనుసంధాన రహదారి నంబూరుకు ఉత్తరంగా పెనుమూలి, మంచికలపూడి, కంతంరాజు కొండూరు, దుగ్గిరాల, చింతలపూడికి ఆవలివైపుగా వెళ్లి నందివెలుగు వద్ద ఓఆర్ఆర్‌తో కలుస్తుంది. ఈ రహదారితో పాటు మంగళగిరి-తెనాలి-నారా కోడూరు రూటులో ప్రస్తుతం ఉన్న డబుల్‌లేన్ రోడ్డును నాలుగులేన్ల రహదారిగా అభివృద్ధి చేయబోతున్నట్టు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇక రెండో లింకురోడ్డు విషయానికొస్తే.. బుడంపాడు వద్ద గుంటూరు హైవే జంక్షన్ నుంచి నారాకోడూరు వరకు సుమారు ఆరున్నర కిలోమీటర్ల పొడవున ఆరులేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నారాకోడూరు వద్ద ఓఆర్ఆర్‌తో లింకు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి మూడు అలైన్‌మెంట్లను పరిశీలిస్తున్నారు.

మూడు దశలు.. 11 ప్యాకేజీలుగా..

ఓఆర్ఆర్‌ను 11 ప్యాకేజీలుగా విభజించి మూడు దశలుగా నిర్మించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల నుంచి గుంటూరు జిల్లా పొత్తూరు వరకు 63 కిలోమీటర్ల పొడవునా మొదటి దశలో పనులను చేపట్టబోతున్నారు. ఇందులో కృష్ణానదిపై పల్నాడు జిల్లా బలుసుపాడు- ఎన్టీఆర్ జిల్లా మున్నలూరు మధ్య ఓఆర్ఆర్‌కు పశ్చిమ దిశగా 3.15 కి.మీల పొడవున కొత్త వంతెనను నిర్మిస్తారు. రెండో దశలో గుంటూరు జిల్లా పొత్తూరు నుంచి కృష్ణాజిల్లా పొట్టిపాడు వరకు మరో 65 కిలోమీటర్ల నిడివిలో నిర్మాణ పనులను చేపడతారు. ఈ దశలో కృష్ణానదిపై ఓఆర్ఆర్‌కు తూర్పుదిశలో గుంటూరు జిల్లా మున్నంగి- కృష్ణాజిల్లా వల్లూరుపాలెం మధ్య 4.8 కిలోమీటర్ల పొడవునా వంతెనను నిర్మిస్తారు. మూడో దశలో పొట్టిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వరకు 62 కిలోమీటర్ల పనులను చేపట్టి ఓఆర్ఆర్‌ను పూర్తి చేస్తారు. మూడోదశలోనే జికొండూరు సమీపంలో 4.4 కిలోమీటర్ల పొడవున టన్నెల్ నిర్మాణం జరగనున్నది.

రేపటి నుంచి దూర విద్య పది, ఇంటర్ పరీక్షలు

గుంటూరు (విద్య), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రి విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే దూర విద్య పది, ఇంటర్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటర్ దూర విద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం 11 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలకు 2,354 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా పది దూర విద్య పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు 1133 మంది విద్యార్థులకు హాజరుకానుండగా వారి కోసం 21 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు దూర విద్య కేంద్రం కోఆర్డినేటర్ శ్రీధర్ వెల్లడించారు.

బాలకోటేశ్వర స్వామి ఆదాయం రూ.50.78 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అమృతలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ బాల కోటేశ్వర స్వామి మహాశివరాత్రి తిరునాళ్ల ఆదాయం రూ. 50,78,374 వచ్చింది. గతేడాది కన్నా రూ.1,87,311 పెరిగింది. ఆలయ ప్రాంగణంలో పర్యవేక్షణ కమిటీ సభ్యులు, దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో శనివారం సిబ్బంది హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. గతేడాది రూ.48,91,063 రాగా, ఈ ఏడాది రూ. 50,78,374 వచ్చిందని సీఎఫ్ఓ అనుపమ తెలిపారు. ఆదాయ వివరాలు ఇలా ఉన్నాయి. లింగోద్భవకాల అభిషేకం ద్వారా రూ. 37,500, రూ.2 వేల అభిషేకాల ద్వారా రూ. 1 లక్షా 78 వేలు, రూ. 500 అభిషేకాల ద్వారా రూ. 2 లక్షల 5 వేల 500, రూ. 200 అభిషేకాల ద్వారా రూ. 4 లక్షల 47 వేల 600, వీఐపీ దర్శనం రూ. 100 ద్వారా రూ. 2లక్షల 70 వేల 800, ప్రత్యేక దర్శనం రూ.50 ద్వారా 2లక్షల 20 వేల 100, శ్రీఘ్రదర్శనం రూ.10 ద్వారా లక్షా 6వేల 440, దాతల విరాళాలు రూ. 89 వేల 451, కొబ్బరి చిప్పల సేకరణ ద్వారా రూ.85 వేలు, కొబ్బరి కాయలు అమ్ముకునే హక్కు ద్వారా లక్షా 65 వేల రూపాయలు, ఖాళీస్థలం అద్దె రూ.15లక్షలు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. లక్షా 60 వేలు, షాపుల అద్దె ద్వారా రూ. 2 లక్షల 30 వేలు, హుండీల ద్వారా రూ. 13 లక్షల 81 వేల 983 వచ్చినట్లు చెప్పారు. పర్యవేక్షణ కమిటీ సభ్యులు పావులూరి రమేష్, మండవ నాగమల్లేశ్వరి, కాటం నాగేశ్వరరావు, బన్నారావూరి ఆంజనేయులు, దివి హైమా ప్రియ, రామదాసు శ్రీనివాసరావు, కొండవీటి లక్ష్మీ భ్రమరాంబ, గండికోట పోలయ్య, మోపిదేవి లక్ష్మి, అల్లూరి విజయకుమారి, అమర్తలూరి బాపూజీ, ఆలయ ఈవో అశోక్‌కుమార్, ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ గ్రామస్తులు పర్యవేక్షించారు.

లేమల్లెలో గుడారాల పండగ

- ఈ నెల 6 నుంచి 9 వరకు నిర్వహణ
- 140 ఎకరాల్లో చురుగ్గా ఏర్పాట్లు



లేమల్లెలో హోసన్న మందిర నిర్మాణం

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని లేమల్లె గ్రామంలో 48వ హోసన్న గుడారాల పండగ ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగుతుందని పాస్టర్ అనిల్ తెలిపారు. హోసన్న మినిస్ట్రీస్‌ను బ్రదర్ హోసన్న 1977లో నెల్లూరు నుంచి వచ్చి లేమల్లె గ్రామంలో ఏర్పాటు చేసి 1993 వరకు ఇక్కడే గుడారాల పండగ నిర్వహించారు. అనంతరం గోరంట్లలో శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి అక్కడే గుడారాల పండగ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గోరంట్లలో స్థలం అందుబాటులో లేకపోవడంతో లేమల్లె వద్ద వారు కొనుగోలు చేసిన 7.5 ఎకరాలలో హోసన్న మందిరం, సిబ్బందికి వసతి గదులు నిర్మిస్తున్నారు. సమీపంలోని 140 ఎకరాలు కౌలుకు తీసుకుని గుడారాల పండగకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పగలు, రాత్రి పాస్టర్ల ప్రసంగాలకు వేలాది మంది కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు పండగ ప్రారంభించి శుక్ర, శనివారాలలో రెండు పూట్ల, ఆదివారం మధ్యాహ్నం వరకు జరిగే ప్రార్థనలతో పండగ ముగుస్తుంది. 2000 మంది సేవకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పండగకు ఇతర దేశాలలో ఉన్న ప్రవాసాంధ్రులు కూడా హాజరు అవుతారని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే పండగకు సుమారు 2 లక్షల మంది విశ్వాసులు హాజరవుతారని ఏర్పాట్లు చేస్తున్నారు. దక్షిణ భారతదేశంలోని సుమారు 2000 హోసన్న మందిరాల నుంచి విశ్వాసులు పండగలో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా శంకర్ కంటి ఆసుపత్రి 21వ వార్షిక వేడుకలు



ప్రసంగిస్తున్న మాదాల రత్నగిరి బాబు, వేదికపై డాక్టర్ సుధాకర్

పెదకాకాని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలో కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శంకర కంటి ఆస్పత్రి 21వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వేడుకలను హాస్పిటల్ చీఫ్ పాటరన్ మాదాల రత్నగిరి బాబు జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నగిరి బాబు మాట్లాడుతూ కంచి కామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి స్వామిజీ కోరిక మేరకు పెదకాకానిలో 4.5 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారని, ఈ ఆస్పత్రి నిర్మాణం వలన గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి చూపు ప్రసాదిస్తున్నట్లు తెలిపారు. అంధత్వ నివారణలో ఆస్పత్రి అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఆస్పత్రికి మరో రెండు లక్షల విరాళాన్ని ఆయన ప్రకటించారు. డాక్టర్ సుధాకర్ పొట్టి మాట్లాడుతూ ఆస్పత్రి పేదలకు కంటి చూపును అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. మెడికల్ అడ్మినిస్ట్రేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కౌశిక్ మురళి, యూనిట్ హెడ్ త్రిపుర, మాదవి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

కారంపూడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కారంపూడి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన పెనుగొండ బ్రహ్మయ్య (45) పట్టణంలో మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అలాగే మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాడు. ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడంతో శుక్రవారం రాత్రి ఇంట్లో తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు నిద్రలేచి చూసేసరికి బ్రహ్మయ్య ఉరితాడుకు వేలాడుతూ ఉన్నాడు. మృతునికి భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. బైక్ మెకానిక్‌లు మృతుని ఇంటి వద్దకు చేరుకొని బ్రహ్మయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 36 వేలను మృతుని కుటుంబ సభ్యులకు అందించారు.

కారు బోల్తా.. వివాహిత మృతి

మాచర్ల రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి బోల్తా పడగా వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపల్లి డొంక వద్ద చోటు చేసుకుంది. కారంపూడి మండలం ఒప్పిచర్లకు చెందిన జొల్లా ప్రకాష్, అతని భార్య ప్రసన్న (40) వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి శుక్రవారం స్వగ్రామానికి కారులో బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో మార్గ మధ్యంలోని కొత్తపల్లి డొంక వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందగా ప్రకాష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. ప్రసన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విజయపురి సౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మండెపూడి గ్రామంలో 75త్యాళ్లూరు నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని పల్లెపోగు వెంకటేశ్వరరావు(70) మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అమరావతిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని మృతి

- మరో విద్యార్థినికి తీవ్ర గాయాలు
- జూపూడి వద్ద జాతీయ రహదారిపై ఘటన
- కళాశాలకు వెళ్తూ కానరాని లోకాలకు..



మృతురాలు తాజ్ అఫ్సా (ఫైల్)

విజయవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వైద్య విద్యార్థిని దుర్మరణం చెందగా, మరో విద్యార్థిని తీవ్ర గాయాలపాలైంది. ఈ ప్రమాదం జూపూడి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక నిమ్రా కాలేజీలో గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన సయ్యద్ తాజ్ అఫ్సా (20) ఎంబీబీఎస్ మూడో సంవత్సరం, చిత్తూరు పట్టణం దుర్గానగర్‌కు చెందిన అర్షా మెహవిష్ (21) ఎంబీబీఎస్ నాల్గో సంవత్సరం చదువుతున్నారు. వీరు పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ స్కూటీపై కాలేజీకి వెళ్తారు. రోజూ మాదిరిగానే శనివారం కూడా బయల్దేరారు. కళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటున్న వీరిని హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తాజ్ అఫ్సా అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మెహవిష్ తీవ్రంగా గాయపడింది. గాయపడిన మెహవిష్‌ను చికిత్స నిమిత్తం నిమ్రాకు తరలించడంతో మిగతా విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ కాలేజీకి తరలించారు. ఘటనాస్థలాన్ని సీఐ చంద్రశేఖర్ సందర్శించి మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు ఆటంకం కలిగించారని సీఐడీ డీఎస్పీ ఫిర్యాదు

- సింగు అజిత్ సోదరులపై కేసు



సింగు అజిత్

చిలకలూరిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన సింగు అజిత్, అతని సోదరుడు దీపక్ తన విధులకు ఆటంకం కలిగించారని, తనను భయభ్రాంతులకు గురి చేశారని గుంటూరు సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య చిలకలూరిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకు కుంభకోణం కేసులో అజిత్‌ను అరెస్టు చేయడం కోసం సీఐడీ పోలీసులు మురికిపూడికి వెళ్లిన సందర్భంలో ఈ సంఘటన జరిగిందని డీఎస్పీ లక్ష్మయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఎస్పీ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు శనివారం తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణం కేసులో బ్యాంకు మేనేజర్ నరేష్‌తో పాటు అజిత్ కీలక నిందితుడిగా ఉన్నారు. వారిద్దరూ కలిసి అనేక అక్రమ నగదు లావాదేవీలు జరిపారు. చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడలోని బ్యాంకు ఖాతాదారులను దారుణంగా మోసగించారు. మొత్తం రూ.70 కోట్ల మేరకు కుంభకోణం జరిగిందని అధికారుల అంచనా. ఇందులో సుమారు రూ.35 కోట్ల మేరకు అక్రమ లావాదేవీలు అజిత్ జరిపినట్టు సీఐడీ పోలీసులు గుర్తించారు. ఈ మొత్తాన్ని అజిత్ తన ఖాతాతో పాటు, తన కుటుంబ సభ్యుల ఖాతాలకు బదిలీ చేసినట్టు పోలీసులు కనుగొన్నారు. కాగా అజిత్‌ను అరెస్టు చేసి విజయవాడలోని ప్రత్యేక కోర్టులో హాజరు పరిచిన అనంతరం న్యాయమూర్తి అతడికి ఈ నెల 13వ తేదీ వరకు రిమాండ్ విధించగా నెల్లూరు జైలుకు తరలించారు.

అడిగిన లంచం ఇవ్వలేదని వీఆర్వో ఆగ్రహం

- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు

అమృతలూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పాసు పుస్తకం మంజూరు చేసే సమయంలో అడిగిన లంచం ఇవ్వలేదని వీఆర్వో ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన ఇటీవల చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని మోపర్రు గ్రామానికి చెందిన ఆలపాటి శివకుమారి తెనాలిలో నివాసం ఉంటున్నారు. తన తండ్రి ద్వారా సంక్రమించిన మోపర్రు గ్రామ పరిధిలోని 0.24న్నర సెంట్లు మాగాణి భూమికి పట్టాదారు పాసు పుస్తకం కోసం 2021లో అప్పటి, ప్రస్తుత వీఆర్వో కిషోర్‌కు అర్జీ అందజేశారు. పాసు పుస్తకం మంజూరుకు రూ. 6 వేలు డిమాండ్ చేయగా శివకుమారి భర్త వీఆర్వోకు రూ. 4 వేలు చెల్లించగా పాసు పుస్తకం వచ్చింది. మిగిలిన రూ. 2 వేలు కోసం అప్పటి నుంచి వీఆర్వో డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో గత నెల 21న భూమి శిస్తు చెల్లించే నిమిత్తం శివకుమారి మోపర్రు వీఆర్వో కార్యాలయంకు వెళ్లగా, పాస్ పుస్తకం తాలూకు రూ. 2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, శిస్తు కట్టించుకోను అంటూ పాసు పుస్తకాన్ని నేలకు విసిరి కొట్టినట్లు బాధితురాలు ఆరోపిస్తున్నారు. అనంతరం శిస్తు కట్టించుకుని రశీదు ఇచ్చారు. అయితే వీఆర్వోపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌ను ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

చర్యలు తీసుకుంటాం..

దీనిపై తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబును వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందనీ, దీనిపై ఆర్ఐ విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. వీఆర్వోపై చర్యలు ఉంటాయని తెలిపారు.

పింఛన్ డబ్బుతో ఉద్యోగి పరార్

దాచేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మునిసిపాలిటీ పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సంపతి లక్ష్మీ ప్రసాదు పింఛన్, విద్యుత్ బకాయిల సొమ్ముతో కన్పించకుండా పోయినట్టు దాచేపల్లి పోలీసులు శనివారం తెలిపారు. దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పింఛన్ డబ్బులు 8,43,500, కరెంటు బిల్లుల డబ్బులు రూ.2.69 లక్షలు వెరసి రూ. 11,12,500 తీసుకొని ఉదయం 9 గంటల నుంచి కన్పించకుండా పోయాడని తెలిపారు. పిడుగురాళ్ళ సచివాలయంలో పని చేసే సంపతి లక్ష్మీ ప్రసాదు దాచేపల్లికి వెల్ఫేర్ అసిస్టెంట్‌గా డిప్యూటేషన్‌పై బదిలీపై వచ్చారు. గత మూడు నెలలుగా పని చేస్తున్నాడు. కన్పించకుండా పోవటంతో కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. శనివారం వేకువజామున ఏటుకూరు బైపాస్ దగ్గర సర్వీస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్ వాసి మృతి చెందాడు. బీహార్ రాష్ట్రంలోని సంస్థాపూర్ జిల్లా బీదన్ తాలూకాకు చెందిన పింకు పాశ్వాన్ (35) బతుకుదెరువు కోసం మిర్చి యార్డులో కూలి పనులకు నగరానికి వచ్చాడు. మిర్చి యార్డు సమీపంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏటుకూరు రోడ్డు బైపాస్ సర్వీస్ రోడ్డు వద్ద లారీ అన్లోడ్ చేసేందుకు వెళ్లాడు. పని అయిపోయిన తర్వాత తోటి కూలీలతో కలిసి సర్వీసు రోడ్డు దాటుతుండగా చిలకలూరిపేట వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న టీఎస్ 07 యూఎఫ్ 6705 నంబర్ గల కారు అతివేగంగా వచ్చి పాశ్వాన్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. రుద్ర చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పాశ్వాన్ మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి బావమరిది మనీష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి వాహనం ఢీకొని..

స్థానిక ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటుకూరు రోడ్డు కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన రిక్షా పుల్లర్ ఆదెయ్య (60) మృతి చెందాడు. ఏటుకూరుకు చెందిన ఇంటర్ విద్యార్థి పరీక్షకు ఆలస్యమవుతుండంతో కంగారుగా ద్విచక్రవాహనంపై అతివేగంగా నగరంలోకి వస్తున్నాడు. కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ ప్రాంతానికి చెందిన రిక్షా పుల్లర్ ఆదెయ్య రిక్షా తెచ్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటర్ విద్యార్థికి కూడా గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 529.20 అడుగులు ఉంది. ఇది 166.58 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6006 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8896, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,103, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1500, ఎల్ఎల్‌సీ ద్వారా 280, ఔట్‌ఫ్లోగా 28,785 విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98, 107, 118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

ఇంటర్ పరీక్షలకు 261 మంది హాజరు

పిట్టలవానిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన ఆయా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు 261 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు రాసేందుకు వివిధ మండలాల పరిధిలోని పిట్టలవానిపాలెం, చందోలు, యాజలి, ఖాజీపాలెం, డి.ఎస్.రాజు జూనియర్ కళాశాల, నిజాంపట్నంలోని సోషల్‌వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ఐదుగురు గైర్హాజరు..

వేమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పరీక్షలు చీఫ్ సూపరింటెండెంట్ గాయత్రి తెలిపారు. 262 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా వారిలో ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన 29 మంది పూర్తిగా హాజరయ్యారు. జనరల్ పరీక్షకు సంబంధించి 238 మందిలో ఐదుగురు గైర్హాజరు కావడంతో 233 మంది తెలుగు, సంస్కృతం పరీక్షలు రాసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడంతో పాటు 144 సెక్షన్‌ను పరీక్ష కేంద్రం పరిధిలో అమలు చేస్తున్నట్లు తెలిపారు.

18 మంది గైర్హాజరు

చెరుకుపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు శనివారం మొదలయ్యాయి. ప్రథమ సంవత్సర పరీక్షకు 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 262 మందికి గాను 8 మంది, గుళ్ళపల్లి ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో 163 మందికి 8 మంది, పొన్నపల్లి గీతం కళాశాలలో 234 మందికిగాను ఇద్దరు పరీక్షలకు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రాల బాధ్యులు తెలిపారు.

చేనేత పరిశ్రమపై పాలక పక్షాలు చిన్న చూపు : బాలాజీ

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పాలక పక్షాలు చేనేత పరిశ్రమపై చిన్న చూపు చూస్తున్నాయని చేనేత కార్మిక సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ శనివారం ఆరోపించారు. భట్టిప్రోలులోని చేనేత సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు లక్షల మందికి పైగా చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, బడ్జెట్‌లో కేవలం రూ. 138.07 కోట్లు కేటాయించి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలుగా సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, రాయితీ, పావలా వడ్డీ, డ్రిప్ ఫండ్, ఇన్‌సెంటివ్ బకాయిలు ఊసే బడ్జెట్‌లో కనిపించ లేదన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేనేతకు రూ.1500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్మికుల సంక్షేమానికి, పరిశ్రమ రక్షణకు సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, కె.వీరమోహన్, ఏఐటీయూసీ నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు

చెరుకుపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటువ్యాధి టీకాల కార్యక్రమం చెరుకుపల్లి మండలంలోని గూడవల్లి, కుంచాలవారిపాలెం, యేమినేనివారిపాలెం, రాంబొట్లవారిపాలెం గ్రామాల్లో శనివారం నిర్వహించారు. మొత్తం 510 పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేశామని, ఈ కార్యక్రమం ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగుతుందని, పశుపోషకులందరూ తప్పకుండా టీకాలు పశువులకు వేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ బొలగాని జ్యోత్స్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పశు వైద్యశాలల సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలకు సిద్ధమవుతున్న ముస్లింలు

పిట్టలవానిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ పండుగ పర్వదిన ఉపవాస దీక్షలకు ఆదివారం తెల్లవారుజాము నుంచి పిట్టలవానిపాలెం మండలంలోని ముస్లింలు సిద్ధమవుతున్నారు. మండలంలోని చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని 10 మసీదులకు చెందిన ముస్లింలు, అదేవిధంగా నదిముల్లాయపాలెం, సంగుపాలెం కోడూరు, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, భవనవారిపాలెం, అల్లూరు గ్రామాలకు చెందిన ముస్లింలు రంజాన్ పండుగ ఉపవాస దీక్షలను ఆచరించేందుకు సిద్ధమవుతున్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల రోజు పీడీఎఫ్ మద్దతుదారుడైన ఎస్.అనీల్‌కుమార్‌పై దాడిచేసిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు శనివారం పట్టణ సీఐ ఆర్.రాంబాబుకు ఫిర్యాదు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడుతూ దొంగ ఓట్లను అడ్డుకొని రిగ్గింగ్‌కు పాల్పడుతున్న వారిని ప్రతిఘటించినందుకు ఈవిధంగా దాడి చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసి నాయకులు మేకల ప్రసాద్, బహుజన సమాజ్ పార్టీ నాయకులు గడ్డం ఏలియా, గుదే రాజారావు, జైభీమ్ పార్టీ నాయకులు పర్రె కోటయ్య, కొచ్చెర వినయరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, వృత్తిదారుల సంఘం నాయకులు కొండయ్య, సీపీఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పేదరికం నుంచి బయటకు తీసుకురావటమే లక్ష్యం

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా అత్యంత వెనుకబడిన కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావటమే పి4 లక్ష్యమని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడిన కుటుంబాల సర్వే, పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్ షిప్ కార్యక్రమంపై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లతో కలెక్టర్ శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సమాజంలో ఆర్థికంగా అత్యంత వెనుకబాటులో ఉన్న నిరుపేద కుటుంబాలను గుర్తించటం కోసం సర్వే చేయాలని చెప్పారు. పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్ విధానం ద్వారా పేదరికాన్ని నిర్మూలించటానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలో సుమారుగా 90 వేల కుటుంబాలు ఆర్థికంగా అత్యంత వెనుకబడి ఉంటాయన్నారు. వీటి వివరాలను సచివాలయాల సిబ్బంది పక్కాగా మొబైల్ యాప్‌లో పొందుపర్చాలన్నారు. నిరుపేదల సర్వే వివరాలను గ్రామసభలలో ప్రకటించి తదుపరి ప్రజల ఆమోదంతోనే నిర్ధారణ చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. కులాలకు సంబంధం లేకుండా నిరుపేదలను గుర్తించటం కొరకు 27 రకాల ప్రశ్నలతో వారి వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. అందులో కీలకమైన 7 రకాల ప్రామాణికాల ఆధారంగా అత్యంత నిరుపేదలను ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. సర్వే నిర్వహించే సచివాలయాల సిబ్బందిని ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజలు సహకరించేలా విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీవో శ్రీనివాస్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

బాపట్ల,మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం దృష్ట్యా జిల్లాలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అన్ని మండలాల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య వలన జిల్లాలో ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణా కెనల్ నుంచి ఈనెల 7వ తేదీ వరకు నీటి సరఫరా ఉంటుందన్నారు. అదేవిధంగా నాగార్జునసాగర్ కెనల్ నుంచి 15వ తేదీ వరకు నీరు విడుదల అవుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌లను 7వ తేదీ నాటికి నీటితో నింపాలన్నారు. గ్రామీణప్రాంతాలలో ట్యాంక్‌ల వివరాలను ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ, పట్టణ ప్రాంతాలలోని ట్యాంక్‌ల వివరాలను మున్సిపల్ కమిషనర్లు నివేదిక తయారు చేయాలన్నారు. ట్యాంక్‌లలో నీటి నిల్వలు తగ్గితే ఎప్పటికప్పుడు వాటిని నీటితో నింపాలని సూచించారు. నీటిసరఫరాలో పైపుల లీకేజిలు పర్యవేక్షించి వాటిని సరిచేయాలన్నారు. ఎక్కడకూడా నీరు కలుషితం కాకుండా చూచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి సాంద్రత, క్లోరినేషన్ పర్యవేక్షించుకోవాలన్నారు. జిల్లాలో నీటిని తరలించటానికి కావాల్సిన ట్యాంక్‌ల విషయంలో ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైన నీటి సమస్య ఏర్పడినట్లు తెలిసినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

మహిళగా పుట్టినందుకు గర్వపడాలి

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సృష్టికి ఆధారమైన మహిళగా పుట్టినందుకు గర్వపడాలని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తెలిపారు. మహిళా సాధికారిత వారోత్సవాలలో భాగంగా ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు బాపట్ల కాపు కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం, వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని అడిషనల్ ఎస్పీ ప్రారంభించి అక్కడ జరిగిన సభలో మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీసుస్టేషన్‌లో మహిళా ఫిర్యాదులను స్వీకరించటానికి ఉమెన్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సఖీ వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరం ద్వారా రోగులకు సేవలందించారు. కార్యక్రమంలో డిఎస్పీ రామాంజనేయులు, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, పట్టణ, రూరల్ సీఐలు ఆర్.రాంబాబు, శ్రీనివాసరావు, హరికృష్ణ, ఆర్ఐ మౌలుద్దీన్, ఏఆర్ ఎస్ఐ స్రవ్య, డాక్టర్ త్రివేణి, డాక్టర్ మౌనిక, ఉషారాణి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు తదితరులు పాల్గొన్నారు.

పురుషులకు ధీటుగా మహిళలు ఎదగాలి

రేపల్లె, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అవరోధించాలని పట్టణ సీఐ మల్లికార్జున్ రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం 2వ వార్డులోని గురుకుల పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ పురుషులకు ధీటుగా మహిళలు ఎదగాలని, మారుతున్న కాలానుగుణంగా విద్యతో పాటు వేరొక రంగాన్ని ఎంచుకుని వాటిల్లో రాణించాలని సూచించారు. కృషి, పట్టుదలతో విద్యార్థినులు ముందుకు వెళ్ళాలని, ప్రతి ఒక విద్యార్థి ఒక గోల్‌ను ఎంచుకుని దానిని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్ళాలన్నారు. అనంతరం విద్యార్థినులకు డాక్టర్స్ లీలా కృష్ణకుమారి, వీరేశలింగం, శివన్నారాయణ విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిజాకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో...



వేమూరు పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శివకృష్ణ

వేమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం వేమూరులో జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఎస్ఐ శివకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు, మహిళలకు ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం జరిపి పోలీసు శాఖ విధి విధానాలను, శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా చట్టాలు తదితర అంశాలను ఎస్ఐ విద్యార్థినులకు వివరించారు. పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో...

భట్టిప్రోలు, కొల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళా దినోత్సవ వారోత్సవాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్ విజయలక్ష్మి శనివారం తెలిపారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమం వివరాలను కార్యకర్తలకు అందించినట్లు చెప్పారు. తొలి రోజున ఉద్యోగుల ర్యాలీ, మొక్కల పంపిణీ, మహిళా ఉద్యోగులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

సైన్స్ అధ్యయనంతో నూతన శకానికి నాంది : ఎంఈవో



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో వీరాంజనేయులు

నగరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సీవీరామన్ స్ఫూర్తితో విద్యార్థినీ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలని నగరం ఎంఈవో వీరాంజనేయులు అన్నారు. నగరంలోని ఆక్స్‌ఫోర్డు గ్రామర్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన సైన్స్‌డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు సైన్స్‌దేనని, సైన్స్ పరిశోధనలతో విద్యార్థినీ, విద్యార్థులు మక్కువతో ముందుకు వెళ్ళాలని, తద్వారా భవిష్యత్తులో సత్ఫలితాలను సాధిస్తారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ యోనోబాబు, ప్రిన్సిపాల్ నాగరాజు, కళాశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా వద్దు... ఆరోగ్యం ముద్దు : ఎక్సైజ్ సీఐ

నగరం, మార్చి1(ఆంధ్రజ్యోతి) : నాటుసారా అనేది అశాస్త్రీయ పద్ధతిలో తయారు చేసే ఒక రకమైన మద్యమని దీనిని సేవించటం ద్వారా అనారోగ్యం పాలవుతారని నగరం ఎక్సైజ్ సీఐ మాటూరి శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. నగరం ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే ముఖ్య ఉద్దేశ్యంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నడుము బిగించిందని, ఇందులో భాగంగానే నగరం ఎక్సైజ్ పరిధిలో నాటుసారాను నిర్మూలించేందుకు కృషి చేస్తానని ఎక్సైజ్ సీఐ తెలిపారు. నాటుసారా అమ్మటం, తయారు చేయటం, రవాణా చేయటం, నాటుసారా కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని, వారికి 8 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.5 లక్షలు జరిమానా విధించబడుతుందని ఆయన వివరించారు.

అంధులకు విద్యా సంస్థ ఆధ్వర్యంలో చెక్కు పంపిణీ

కొల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలకు సంబంధించిన చెక్కును శనివారం అంధులకు టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ అందజేశారు. స్థానికంగా ఉన్న ఫోర్ ఫ్రంట్ విద్యా సంస్థ యాజమాన్యం, ఉపాధ్యాయులు సహకారంతో విద్యార్థులు రూ.55,570 నగదు అంధుల కోసం విరాళాలు సేకరించారు. ఆ మొత్తాన్ని విద్యా సంస్థ డైరెక్టర్ తెనాలి నవీన్‌పాల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మురళీకృష్ణ చేతుల మీదుగా అంధులకు అందజేశారు. తమకు సహాయం అందించిన విద్యా సంస్థ యాజమాన్యానికి, విద్యార్థులకు అంధుల గ్రూపు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనితకుమారి రాజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విరాళాలను చెక్కు రూపంలో అంధుడికి అందజేస్తున్న టీడీపీ నేత మురళీకృష్ణ, ఫోర్ ఫ్రంట్ విద్యా సంస్థ ప్రతినిధులు

కొల్లూరులో ఉచిత వైద్య శిబిరం

కొల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాలలో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యురాలు కావ్యతేజ పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం కొల్లూరు బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థినులను పోలీస్‌స్టేషన్‌కు ఆహ్వానించి ఓపెన్ హౌస్ ప్రోగ్రాం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్, పోలీసుల విధి విధానాల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జన్మతిథి వేడుకలు



రామకృష్ణ పరమహంస చిత్రపటానికి పుష్పాలంకరణ చేస్తున్న హైవెండ్ విద్యార్థులు

కర్లపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీరామకృష్ణ సేవాసమితిలో భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస జన్మతిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు శ్రీరామకృష్ణ పరమహంస వారికి పుష్పాలంకరణ చేశారు. ముందుగా స్వామివారికి హారతి, ధ్యానం, సుప్రభాతం, నిత్యపూజ, అష్టోత్తర శతనామపూజ, కథామృతం పఠనం, విష్ణుసహస్రనామ పారాయణం, భజనలు, హారతి నైవేద్య కార్యక్రమాలను స్వామి పూర్ణానందమహరాజ్ (సతీష్‌మహరాజు) ఘనంగా నిర్వహించారు. కూచిపూడి నృత్యం, కోలాట ప్రదర్శనలు చేశారు. అనంతరం మంతెన సత్యనారాయణరాజు దాతల సహకారంతో 350 మంది భక్తులకు భోజనం, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి పూర్ణానందమహరాజు అనుగ్రహభాషణ చేశారు. అధ్యక్షులు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, కార్యదర్శి చందు పిచ్చియ్య, పెనుమెత్స బాపిరాజు, ఆరె వెంకటేశ్వర్లు, బుర్ల బుల్లియ్య, తనకా శ్రీనివాసరావు, ఆలపాటి సాంబశివరావు, రావి సుభాష్‌రెడ్డి, తూనుగుంట్ల రామ్మోహనరావు, సుబ్బారావు, బాజి, కృష్ణమూర్తి, స్వామి, సత్యవతి, మణి, ప్రసన్న పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామకృష్ణ జయంతి సందర్భంగా రామకృష్ణ భక్తసమాజం వారు వైష్ణవి కూచిపూడి నృత్య నాట్యాలయం వారిచే శనివారం ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో వైష్ణవి, శాన్వి, ప్రణతి, తేజస్వి, సంతోషి, చక్రిత, దీక్షిత, భవిత, పావనిలు నృత్య ప్రదర్శన చేశారు. ఆద్యంతం విశేషంగా ఆకట్టుకున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులు పాల్గొని వీక్షించారు.

లబ్ధిదారుల ఇళ్ళ వద్దకే పెన్షన్లు : ఆర్డీవో



ఈస్ట్‌బాపట్లలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఆర్డీవో పి.గ్లోరియా

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారుల ఇళ్ళవద్దకే వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు శనివారం ఈస్ట్ బాపట్ల గ్రామపంచాయతీ నంది రాజుతోట ఎస్టీ కాలనీలో ఆమె పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసి భరోసా కల్పించారు. ప్రతినెల ఇంటివద్దకే పెన్షన్లు తెచ్చి ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రవీణారాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్లు అందజేత

కర్లపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లంకకాల్వ కట్టపై నివసిస్తున్న దివ్యాంగులకు శనివారం పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో పి.గ్లోరియా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో కేఎల్ ప్రభాకర్, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెన్షను అందజేస్తున్న విజయలక్ష్మి తదితరులు

అల్లూరులో...

పిట్టలవానిపాలెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలోని 12గ్రామ సచివాలయాలకు చెందిన ఉద్యోగులు, గ్రామపంచాయతీల కార్యదర్శులు, మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో శనివారం పెన్షన్ వినియోగదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేశారు. మండలంలోని అల్లూరు గ్రామ సచివాలయ పరిధిలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో చెరుకూరి విజయలక్ష్మి అక్కడకు వెళ్ళి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, అల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మావతి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి వ్యర్థాలు ఏరివేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి శనివారం స్వచ్ఛంద్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే తీరంలో వ్యర్థాలు ఏరివేసి శుభ్రం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయసాధన కోసం స్వచ్ఛ బాపట్ల కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమినాయకులు పాల్గొన్నారు.



జేపీ చౌదరిని సన్మానిస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు తదితరులు

ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు ముందడుగు వేయాలి

● ఏపీ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ జేపీ చౌదరి

● బీఈసీలో అంబరాన్ని అంటిన బెక్టాగన్ సంబరాలు

బాపట్లరూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు అడుగులు ముందుకేసినప్పుడు అద్భుతమైన విజయాలను అలవోకగా సాధించగలుగుతారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరి, ఇండస్ట్రీ లీడర్ డాక్టర్ జేపీ చౌదరి అన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులుగా జరుగుతున్న బెక్టాగన్ 2025 ఉత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కన్వీనర్ ప్రొఫెసర్ డి.నిరంజన్‌బాబు అధ్యక్షత వహించగా చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చక్కటి నడవడిక, ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలన్న తపన, ఆత్మనూన్యతా భావాన్ని విడనాడి విశ్వాసంతో ముందుకెళ్ళాలన్నారు. బెంగుళూరు ఎస్‌సీఈ అండ్ ఎం సీఈవో జాన్స్ టెల్లీస్ మాట్లాడుతూ యువతలో ఏదైనా సాధించగలిగే శక్తి, సామర్థ్యం మెండుగా ఉన్నాయని, వాటిని గమనించి మెరుగుపర్చుకుంటే అద్భుతమైన విజయాలు సొంతం చేసుకోవచ్చని చెప్పారు.

కార్యక్రమంలో భాగంగా 65 రకాల పోటీలు నిర్వహించగా 2వేల మందికి పైగా 200 సాంకేతిక సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. స్ఫూర్తిని నింపి విలువైన సందేశాలను అందించిన అతిథులను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు సన్మానించారు.

అలరించిన సినీగాయకుల సంగీత విభావరి

సినీగాయకులు యశస్వి, ఓంకార్, సుహాసినీలు ఆలపించిన సినీగీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రోతలను ఆనందరస తరంగాలలో అలరింపచేశాయి. కార్యక్రమంలో కో కన్వీనర్ డాక్టర్ కె.రాజేంద్ర, ఆంగ్ల విభాగ అధ్యక్షుడు డాక్టర్ పీవీ నాగమల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్, ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షులు పారేపల్లి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి దొడ్డపనేని వెంకయ్యచౌదరి, కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, వి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అంటువ్యాధుల నుంచి పశుసంపదను కాపాడాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అంటువ్యాధులు నుంచి పశుసంపదను అధికారులు కాపాడాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభ సూచికగా వాల్‌పోస్టర్‌లను శనివారం కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సంబంధితాధికారులకు పలు సూచనలు చేశారు. పశుసంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పశువైద్యాధికారులపై ఉందని కలెక్టర్ చెప్పారు. ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వ్యాధి నిరోధకటీకాలను ఉచితంగానే పశువులకు వేస్తామన్నారు. గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు, బ్రాసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా వస్తున్న టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తెలిపారు. బాపట్ల పట్టణంలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను అడిషనల్ ఎస్పీ తనిఖీ చేశారు. బాపట్ల పబ్లిక్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలుసూచనలు చేశారు. జిల్లాలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేశామన్నారు. మాల్‌ప్రాక్టీస్‌కి ఆస్కారం లేకుండా ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాలలోకి పంపటం జరిగిందన్నారు. సెల్‌ఫోన్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర నిషేధిత పరికరాలను అనుమతించబోమన్నారు. పరీక్ష కేంద్రాలకు చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్‌లను మూసివేయటం జరిగిందన్నారు. పోలీసు శాఖ ఆదేశాలను అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

చెల్లని ఓట్లపై అభ్యర్థుల్లో గుబులు

● గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 10,576 లెక్కింపునకు తిరస్కరణ

● ఈ దఫా ఎక్కువ శాతం పెరిగే అవకాశం

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మరో 24 గంటల్లో ప్రారంభం కానుంది. ఈ నెల 3వ తేదీ ఉదయం 8 గంటలకు గుంటూరు నగరంలోని ఏసీ కళాశాల ప్రేయర్‌హాల్‌లో కౌంటింగ్ ప్రక్రియకి శ్రీకారం చుడతారు. ఈ నేపథ్యంలో పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులు చెల్లని ఓట్ల సంఖ్య ఎంత ఉంటుందనే దానిపై ఆందోళన చెందుతున్నారు. ఇందుకు కారణం క్రితంసారి ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగినప్పుడు 10,576 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. అప్పట్లో పోలింగ్ అయిన ఓట్ల సంఖ్య కూడా 1,49,158 మాత్రమే. ఈ దఫా 2,41,502 ఓట్లు అంటే దాదాపుగా 92,344 ఓట్లు అధికంగా పోలింగ్ అయ్యాయి. దీనిని పరిగణనలోకి తీసుకొంటే చెల్లని ఓట్లు ఎన్ని వేలల్లో ఉంటాయనే దానిపై ఒక అంచనాకు రాలేకపోతున్నారు. ఒక వేళ వీటి సంఖ్య ఎక్కువగా ఉంటే అభ్యర్థుల జయ, అపజయాలపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.

ఓటింగ్‌పై స్పష్టత లేకపోవడమే..

ఈ దఫా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. గతంలో 60 శాతం లోపే ఉన్న పోలింగ్ ఈసారి 69.57 శాతానికి ఎగబాకింది. అయితే పోలింగ్ బూత్‌ల వద్దకు ఓటర్లు వచ్చిన సందర్భంలో ఈ దఫా కొత్తగా ఓటు వేయబోతున్న ఓటర్లలో చాలామందికి ఓటింగ్ విధానంపై స్పష్టత కొరవడింది. నిబంధనల మేరకు ప్రిసైడింగ్ అధికారి ఇచ్చిన బ్యాలెట్ పేపర్‌లో ఏ అభ్యర్థికి తొలి ప్రాధాన్య ఓటు వేయదలిచారో ఆ అభ్యర్థి పేరు పక్కన ఉన్న గడిలో 1 అని అంకె వేస్తే సరిపోతుంది. అది కూడా పీవో సమకూర్చిన వంకాయరంగు ఇంకు పెన్నుతో మాత్రమే నమోదు చేయాలి. ఆ తర్వాత అభ్యర్థుల వారీగా ఎంతమంది ఉంటే అంతమందికి 2, 3, 4, 5... ఇలా ప్రాధాన్యతలను ఇచ్చుకోవచ్చు. ఈ ఓటు చెల్లుబాటు అవుతుంది. ఒక వేళ 1 అంకె వేసి దాని చుట్టూత సున్నా చుట్టినా చెల్లదు. అలానే ఆంగ్లం, తెలుగులో అక్షరాలతో రాయకూడదు. రైట్, ఇంటూ టిక్ మార్కులు చేయకూడదు. ఈ నిబంధనల నేపథ్యంలో ఎన్ని ఓట్లు చెల్లుబాటు కాకుండా పోతాయోనని అభ్యర్థుల అనుచరులు మదనపడుతున్నారు. డ్యూటీ పాసుతో దరఖాస్తు చేసుకొన్న ఉద్యోగుల్లో 590 మందికి పోస్టల్ బ్యాలెట్‌లు పంపిణీ చేశారు. వాళ్లలో ఇప్పటి వరకు 274 మంది ఆర్‌వో కార్యాలయానికి పోస్టు ద్వారా ఓటు వేసిన బ్యాలెట్ పేపర్లను తిరిగి పంపించారు.



ఓట్ల లెక్కింపు కేంద్రంలో సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణ తరగతుల్లో కలెక్టర్, ఆరు జిల్లాల అధికారులు

ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కౌంటింగ్ సిబ్బంది, పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌లో ఆర్‌వోతో పాటు సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, కృష్ణ జిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్‌లతో సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్ల లెక్కింపులో పూర్తి ఏకగ్రతతో సమర్థవంతంగా కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. చెల్లుబాటు అయ్యే ఓట్లు, చెల్లని ఓట్లుకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలపై కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండి లెక్కింపు సమయంలో ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు సమయానికి నిర్దేశిత ఆధిక్యం రాకపోతే, పోటీలో ఉన్న అతి తక్కువ మెజార్టీ వచ్చిన అభ్యర్థుల ఓట్లలో తదుపరి ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు కేటాయిస్తూ ఆ అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ కొనసాగించాల్సి ఉంటుందన్నారు. 483 పోలింగ్ బూత్‌లలో నిర్వహిస్తున్నందున ఓట్లు లెక్కింపునకు 28 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కింపు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై ఆర్‌వో నాగలక్ష్మి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చిన బ్యాలెట్ బాక్స్‌లు తీసుకువచ్చినప్పుడు పోలింగ్ కేంద్రం, పోలైన ఓట్లు, తదితర వివరాలు పూర్తిగా సరిచూసుకొని బాక్స్‌లు ఓపెన్ చేసి కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల డీఆర్‌వోలు ఎన్ ఎస్‌కే ఖాజావలి, మురళి, గంగాధర గౌడ్, చంద్రశేఖర్, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి పాల్గొన్నారు.

పీఎంజీఎస్‌వై కింద రూ. 143.24 కోట్లు మంజూరు

● గుంటూరు జిల్లాలో 12 రహదారులు, ఒక వంతెన

● వెల్లడించిన పెమ్మసాని, ఎమ్మెల్యేలు


వివరాలు వెల్లడిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

తాడేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన ఫేజ్ 3 కింద రహదారులు, వంతెనల నిర్మాణం నిమిత్తం రూ.143.24కోట్లు మంజూరయ్యాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండలోని జయభేరి ది క్యాపిటల్ అపార్టుమెంట్‌లో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు వివరాలు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎక్కడెక్కడ కేంద్ర ప్రభుత్వం నిధులు అవసరమో ఆయా పనులు గుర్తించి క్రమపద్ధతిలో డీపీఆర్‌లు తయారు చేశామనీ, నిధులు తెచ్చి ఎమ్మెల్యేల సహకారంతో ఆయా ప్రాంతాల్లో రహదారులు, వంతెనల నిర్మాణ పనుల మంజూరుకు కృషి చేశామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

గుంటూరు జిల్లాలో 12 రహదారులు

గుంటూరు జిల్లాలో 78.51 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులకు రూ.89.24కోట్లు మంజూరు కాగా వాటిలో కేంద్ర వాటా రూ.53.544కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.35.696 కోట్లుగా ఉందని మిగిలిన వాటి వివరాలను పెమ్మసాని వివరించారు.

పొన్నూరు నియోజకవర్గ పరిధిలో..

పొన్నూరు నియోజవర్గ పరిధిలో చేబ్రోలు మండలంలోని తెనాలి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కొలకలూరు వరకు 7.38 కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.7.10 కోట్లు, ఇదే మండలంలోని శ్రీరంగపురం బకింగ్ హామ్ కెనాల్ నుంచి భట్టిప్రోలు బ్రాహ్మణకోడూరు రోడ్డు (వయా తోట్లపాలెం) 4.86 కిలోమీటర్లుకు రూ.5.24 కోట్లు, పెదకాకాని మండలంలోని దేవరాయభొట్లపాలెం నుంచి కొప్పురావూరు వరకు 8.31 కి.మీ.కు రూ.11.52 కోట్లు, వెరసి మొత్తం 21.55 కి.మీ.గానూ రూ. 23.86 కోట్లు మేర పనులు జరగనున్నాయి.

ప్రతిపాడు నియోజకవర్గ పరిధిలో...

పెదనందిపాడు మండలంలో పెదనందిపాడు ఆర్‌బీ రోడ్డు నుంచి నాగభైరవపాలెం (వయా పరిటాలవారి పాలెం) వరకు 5.541 కి.మీ.కు రూ.4.47 కోట్లు, ఈదులపాలెం నుంచి ఓల్డ్ మద్రాస్ రోడ్డు 13.9 కి.మీ వద్ద (వయా యనమదల - తిక్కిరెడ్డిపాలెం) 6.097 కి.మీ.కు రూ.10.30 కోట్లు, వట్టిచెరుకూరు మండలం ముత్తూరు నుంచి బురదగుంట మాలపల్లి (వయా కారంపూడిపాడు, సోపాడు) 10.594 కి.మీకు రూ.11.58 కోట్లు వెరసి మొత్తం 22.232 కి.మీ.గానూ రూ. 26.35 కోట్లు మేర పనులు జరగనున్నాయి.

తాడికొండ నియోజకవర్గ పరిధిలో..

ఫిరంగిపురం మండలం నరసరావుపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గుండాలపాడు (వయా పొనుగుపాడు) 5.65 కి. మీ.కు రూ.4.12 కోట్లు, తుళ్ళూరు మండలం పెదపరిమి నుంచి మోతడక 4.88కి.మీ.కు రూ.8.24కోట్లు వెరసి మొత్తం 10.145కి.మీ.కు రూ.12.36కోట్లమేర పనులు జరగనున్నాయి.

తెనాలి నియోజకవర్గ పరిధిలో...

కొల్లిపర మండలంలోని కుంచవరం, దంతలూరు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తెనాలి సిరిపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు (వయా అత్తోట యాదవపాలెం, అత్తోట, నేలపాడు) 5 కి.మీ.కు రూ.4.09 కోట్లు, గుంటూరు హనుమాన్‌పాలెం, ఆర్‌బీ రోడ్డు 33.80 కి.మీ అన్నవరం దళితవాడ (వయా తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం) 3.853 కి.మీకు రూ.4.35 కోట్లు, తెనాలి నుంచి పెదరావూరు (వయా కఠెవరం, కోపల్లె, జేఎంజే కాలేజీ, సుందరయ్యనగర్, మల్లిపాడు) 10.447 కి.మీ.కు రూ.11.10కోట్లు వెరసి మొత్తం 19.3 కిలోమీటర్లు రూ.20.35కోట్ల మేర పనులు జరగనున్నాయి.

లంక గ్రామాల్లో వంతెన

గుంటూరు జిల్లాలో 25 వేల మంది లంక గ్రామాల వాసులకు ఉపయోగకరంగా ఉండేందుకు వంతెన నిర్మాణం అవసరం కాగా రూ.54 కోట్లు మంజూరు కావల్సి ఉందనీ, అయితే పీఎంజీఎస్‌వై ఫేజ్ 3 కింద నామ్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం పదికోట్ల నిధులు మంజూరుచేసిందనీ, అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.40కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని, ఫండ్స్ రాగానే ఈ పనులు కూడా కొద్దిగా లేట్ అయినా ప్రారంభిస్తామని పెమ్మసాని చెప్పారు. అన్నవరం దళితవాడ వయా తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం వద్ద 468.98 మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారి వంతెన నిర్మించాల్సి ఉంటుందన్నారు.

పట్టణంలోనే రెండు సెంట్లు కోరుతున్నారు

గుంటూరు ఇన్నర్‌రింగ్‌రోడ్‌కు సంబంధించి 320 ఇళ్లు ఖాళీ చేయించాల్సి ఉంటుందనీ, అయితే అందరూ పేదలు కావడం, వారందరూ సీఎం చంద్రబాబు ఇస్తామన్న రెండు సెంట్ల స్థలం పట్టణంలోనే ఇవ్వాలని కోరుతున్నారని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చెప్పారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏమీ పట్టించుకోలేదన్నారు.

పెమ్మసాని.. యమా స్పీడ్

ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ యమా స్పీడ్‌గా పనులు చేయిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పనుల శాంక్షన్‌కు కృషి చేస్తున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వ్యాఖ్యానించారు. లంక గ్రామాలలో వంతెనకు సంబంధించి వచ్చే ఏడాది వరకు సమయం పడుతుందని అనుకున్నానని కానీ పెమ్మసాని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిబంధనల ప్రకారం రూ.10కోట్లు కేటాయింపజేశారని వ్యాఖ్యానించారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 3వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. శనివారం సాయంత్రం ఇరువురు జిల్లా అధికారులు ఏసీ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు టేబుళ్లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీవో కె.శ్రీనివాస రావు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు, రెవెన్యూ, సర్వే, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


ఏసీ కళాశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

డ్వాక్రా @ ఈ కామర్స్



ఆన్‌లైన్ అమ్మకాలపై డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ పి. పద్మ (ఫైల్‌ఫొటో)

(5వ పేజీ తరువాయి)

ఓఎన్‌డీసీ పోర్టల్‌లో ఉంచారు. ఈ వేదిక ద్వారా డ్వాక్రా ఉత్పత్తులను బుక్ చేసుకునే వినియోగదారులపై అదనపు భారం పడకుండా డెలివరీ చార్జీలను ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలతో పోల్చుకుంటే చౌకగా వస్తువులు దొరికే వీలున్నందున భవిష్యత్‌లో పెద్దఎత్తున డ్వాక్రా ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరగడం ఖాయమనే ఆశాభావాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. ఈ ప్రక్రియపై ప్రజల్లో ప్రచారం కల్పించాల్సి ఉంది. దిగ్గజ కంపెనీల ఉత్పత్తులన్నీ బ్రాండ్‌ను ప్రమో ట్ చేసుకుంటూ పెద్దఎత్తున ఆన్‌లైన్ వాటాను చేజిక్కించుకున్నాయి. ఓ అంచనా ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికల మీద ఇంటి అవసరాలకు ఉపయోగపడే సామగ్రిపై రోజుకు జరిగే వ్యాపారం అక్షరాల రూ.4 కోట్లుగా లెక్క తేల్చారు. ఈ పోటీని తట్టుకుని డ్వాక్రా మహిళలు నిలబడడానికి ప్రభుత్వం ఇచ్చే ఊతానికి తోడు వారు కూడా అవగాహన తెచ్చుకోవడంతో పాటు వినూత్న పద్ధతులలో తమ ఉత్పత్తులను ప్రమోట్ చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా ఇలా...

బాపట్ల జిల్లాలో 1024 గ్రామైక్య సంఘాలలో 33,430 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో 1050 సంఘాలకు 35,000 మంది, గుంటూరు జిల్లాలో 575 సంఘాలలో 16,500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆయా గ్రామైక్య సంఘాల నుంచి ఆసక్తితో పాటు ప్రాథమికంగా ఆన్‌లైన్‌పై అవగాహన కలిగిన వారిని ఎంపిక చేసి ఎంటర్‌ప్రెన్యూర్లుగా డీఆర్‌డీఏ రిజిస్ట్రేషన్ చేసింది. ఒక్క బాపట్ల జిల్లాలోనే వీరి సంఖ్య 693గా ఉండగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే 2,800గా ఉంది. ఇప్పటికే ఆన్‌లైన్ వేదికగా జరిగిన లావాదేవీల మొత్తం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే రెండు లక్షల దాకా ఉన్నట్లు యంత్రాంగం చెబుతోంది. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి నాణ్యతతో ఉత్పత్తులు తయారు చేస్తున్నా మార్కెటింగ్ అవకాశాలు లేక ఇబ్బందులు పడిన తమకు కూటమి ప్రభుత్వం తీసుకున్న స్మార్ట్ నిర్ణయంతో లబ్ధి చేకూరనున్నదని డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి పథకాలకు.. నిధులు

(5వ పేజీ తరువాయి)

30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసింది. ఏఐఐబీ ఇచ్చే రుణంను కేంద్ర ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుంది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వాడేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన 30 శాతం నిధుల మాట ఎలా ఉన్నా రుణం నిధులను దారి మళ్లించడంతో పథకాలు నిలిచిపోయాయి. ఐదేళ్లు తాగునీటి పథకాల విస్తరణ పనులపైన, ప్రజల తాగునీటి ఇబ్బందులపైన వైసీపీ పాలకులు దృష్టి సారించలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపాల్టీలలో తాగునీటి సమస్యలు పరిష్కారిస్తామని, తాగునీటి పథకాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన తర్వాత ఆ పనులపై దృష్టి సారించింది. అయితే ఏఐఐబీ పథకం గడువు పూర్తి కావడంతో సదరు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీని స్థానంలో యుఐడీఎఫ్ పథకం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో కూడా 70 శాతం రుణం.. 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనంగా నిధులు మంజూరు చేశారు.

పెరిగిన వ్యయం..

ఐదేళ్లుగా తాగునీటి పథకాల విస్తరణ పనులు నిలిచిపోవడంతో వ్యయం పెరిగింది. కొత్త రేట్ల ప్రకారం నీటి పథకాలకు వ్యయం అంచనాలను పబ్లిక్ హెల్త్ శాఖ రూపొందించింది. ఈ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నీటినిల్వ చెరువుల ఆధునికీకరణ, పైపులైన్ల నిర్మాణం, నీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధి ప్లాంట్ల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. గృహాలకు నీటి సరఫరా కోసం డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మిస్తారు. మాచర్లలో సుమారు రూ.55 కోట్లతో పనులు చేపట్టగా 10 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. పిడుగురాళ్లలో రూ.102 కోట్లతో పనులు చేపట్టగా 20 శాతం కూడా పూర్తి కాలేదు. వినుకొండలో రూ.138 కోట్లతో చేపట్టిన పనులు ముందుకు సాగడంలేదు. ఇక్కడ కూడా 20 శాతం లోపే పూర్తయాయి. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయకపోవడంతో దాదాపు రూ.141 కోట్లుగా వ్యయం పెరగడం గమనార్హం. ఇదే పరిస్థితి గుంటూరు కార్పొరేషన్ సహా మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి మున్సిపాల్టీల్లో నెలకొంది.

క్రీడాకారుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యం

● శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లి(కొలనుకొండ), మార్చి 1(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల ప్రయోజనాలే రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. క్రీడాకారుల భవిష్యత్తే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు వ్యాఖ్యానించారు. కాకినాడకు చెందిన జాతీయ క్రీడాకారిణి ఎస్‌కే యాసిన్ కొలనుకొండలోని శాప్ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో రవినాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్ వేదికగా జనవరి 28 నుండి ఫిబ్రవరి 14 వరకు జరిగిన 38వ జాతీయ క్రీడల్లో జిమ్నాస్టిక్స్‌లో భాగంగా ట్రాంపోలిన్ వ్యక్తిగత విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్టు తెలిపారు. ఆమె సాధించిన పతకాలు, విజయాలను తెలియజేశారు. పోటీల్లో పాల్గొనే క్రమంలో యూనివర్సిటీ అటెండెన్స్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందిని వివరించగా పరిష్కారం దిశగా శాప్ చైర్మన్ రవినాయుడు స్పందించారు. అనంతరం ఆమెను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత రాణించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని క్రీడా వసతులు, ప్రోత్సాహకాల పరంగా శాప్ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని రవినాయుడు హామీ ఇచ్చారు.

జాతీయ క్రీడాకారిణి ఎస్‌కే యాసిన్‌తో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు



డేటా సమగ్రంగా ఉండాలి

● మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో వివిధ జిల్లాల నుంచి వచ్చి మిరపకాయలను విక్రయిస్తున్న రైతుల డేటా సమగ్రంగా కమీషన్ వ్యాపారస్తుల వద్ద అందుబాటులో ఉండాలని మార్కెటింగ్ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం మిర్చియార్డు పరిపాలన భవనంలో ఆయన కమీషన్ వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు ఒకటో తేదీ నుంచి మిర్చి విక్రయాలకు సంబంధించిన రైతుల వివరాలు మార్కెట్ కమిటీకి సాధ్యమైనంత త్వరగా నివేదించాలన్నారు. అందులో రైతుల పేర్లు, ఆధార్ నంబర్లు, బ్యాంకు అకౌంట్స్, ఏ ట్రేడర్ వాళ్ల మిర్చిని కొనుగోలు చేసింది, ఎంత మోతాదులో అమ్మకం చేశారు వంటి వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ డేటా మొత్తాన్ని త్వరలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో నివేదించాల్సి ఉందన్నారు. రైతుల ఈ-క్రాప్ బుకింగ్ వివరాలు కూడా సేకరించాలన్నారు. అలానే యార్డులో సమీకృత ఎలక్ట్రానిక్ కాటాల ఏర్పాటుకు సంబంధించి ఒక టీంని త్వరలోనే ఖమ్మం మార్కెట్ కమిటీకి పంపిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి హాజరైన మిర్చి కమీషన్ ఏజంట్లు మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు డిసెంబరు నుంచి రైతుల వివరాలు ఇవ్వాలంటే చాలా కష్టమన్నారు. మార్చి 1వ తేదీ నుంచి ప్రభుత్వం నిర్దేశించిన నమూన ప్రకారం వివరాలు తెలియజేయగలమని చెప్పారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ బి.రాజబాబు, మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు, ఏడీ రాజబాబు, సెక్రెటరీ చంద్రిక, హాజరైన వ్యాపారులు

వెటర్నరీ విద్యార్థులపై వివక్ష

● ఎంబీబీఎస్ విద్యార్థుల స్టైఫండ్ నెలకు రూ.25,906

● ఆయుర్వేదం, బీడీఎస్ చదివేవారికి అంతే మొత్తం సహాయం

● వెటర్నరీ విద్యార్థులకు ఇచ్చేది రూ.7 వేలే

● 13 ఏళ్లుగా ఒకటే వేతనం

● పక్క రాష్ట్రాలతో పోల్చినా ఇక్కడ ఇస్తుంది చాలా తక్కువే



గుంటూరులోని పాలీ క్లినిక్‌లో కుక్కకు వైద్య సేవలు అందిస్తున్న హౌస్ సర్జన్లు

గుంటూరు సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ చదివిన వాళ్ళు మనుషులకు వైద్యం చేస్తే.. వెటర్నరీ సైన్సు చదివిన వాళ్ళు పశువులకు వైద్యం చేస్తారు. కోర్సు వ్యవధి.. హౌస్ సర్జన్ కాలపరిమితి ఇద్దరికీ సమానమే. చెప్పుకోవాల్సిన సంగతి ఏమిటంటే మనుషులకు వైద్యం చేసే కన్నా.. నోరు లేని పశువులకు వైద్యం చేయడమే ప్రమాదకరమైనది. హౌస్‌సర్జన్ చేసే కాలంలోనే జంతువుల నుంచి వ్యాప్తి చెందే అత్యంత ప్రమాదకరమైన రోగాలైన ర్యాబీస్, లెప్టో స్పైరా, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్ విద్యార్థులకు సోకుతూ ఉంటాయి. ఆ క్రమంలోనే కరీష్మా అనే విద్యార్థిని లెప్టో స్పైరా అనే వ్యాధి సోకి(ఎలుక మూత్రం వల్ల సోకే ఈ వ్యాధి వల్ల మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) ఈ మధ్య కాలంలో మృతి చెందారు. అటువంటి ప్రమాదకరమైన పరిస్థితిలోనూ హౌస్ సర్జన్ చేస్తున్న వెటర్నరీ సైన్సు విద్యార్థులకు ఇచ్చే స్టైఫండ్‌లో ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయి. ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు నెలకు రూ.25,906 స్టైఫండ్‌గా ఇస్తుంటే, వెటర్నరీ సైన్సు అండ్ యానిమల్ హస్బెండరీ విద్యార్థులకు మాత్రం నెలకు రూ.7 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు.

2013 నుంచి అంతే....

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పాలీక్లినిక్‌ల్లో వెటర్నరీ సైన్సు చదివిన హౌస్ సర్జన్లు మాత్రమే పశువులకు వైద్యసేవలు చేస్తున్నారు. గుంటూరు వంటి నగరాల్లో రోజుకు కనీసం 300 పైగా ఓపీ వస్తుండగా, జంతు ఆరోగ్య సంరక్షణలో హౌస్‌సర్జన్ల పాత్ర కీలకమైనదని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. వాళ్ళు లేకపోతే పాలీక్లినిక్‌లు నడపడం కష్టం అంటున్నారు. నిజానికి 2013లో ఎంబీబీఎస్, వెటర్నరీ సైన్సు, బీడీఎస్, బీఏ ఎంఎస్ చదివే విద్యార్థులకు రూ.7వేలు మాత్రమే స్టైఫండ్ ఇచ్చేవారు. ఆ తర్వాత మిగిలిన వారి స్టైఫండ్‌ను రూ.25,906కు పెంచారు. కానీ వెటర్నరీ విద్యార్థులను మాత్రం మర్చిపోయారు. వాస్తవానికి ఇంటర్‌లో బైపీసీ తీసుకున్న ప్రతి విద్యార్థి ఎంబీబీఎస్ చదవాలని కలలు కంటారు. అది సాధ్యం కాకపోతే కనీసం వెటర్నరీ సైన్సు సీటు వస్తే బాగుండు అనుకుంటారు. డిమాండ్ ఉన్న ఈ రెండు కోర్సులకు మెరిట్ కలిగిన విద్యార్థులు పోటీ పడుతుంటారు. ఆ తర్వాతే హోమియో, ఆయుర్వేదం, బీడీఎస్ వంటి కోర్సులకు వెళ్తారు. ప్రతిభ కలిగిన తమను పక్కన పెట్టేసి హోమియో, ఆయుర్వేదం, బీడీఎస్ విద్యార్థులకు స్టైఫండ్ ఎక్కువగా ఇస్తున్నారని బాధితులు చెబుతున్నారు. గుంటూరులోని లాంలో ఉన్న శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడి పశు వైద్య కళాశాలల నుంచి ప్రతి ఏటా కేవలం 200 మంది విద్యార్థులు హౌస్‌సర్జన్‌లుగా బయటకు వస్తున్నారు. వాళ్లు కాకుండా మరో 220 మంది విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ చేసే వారున్నారు. గత ప్రభుత్వంలో ఈ విద్యార్థులు స్టైఫండ్ పెంపు కోసం ఉద్యమం చేశారు. అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు స్టైఫండ్ రూ.21 వేలు చేస్తే ప్రభుత్వం మీద పడే భారం ఏటా కేవలం రూ.12కోట్లేగా ఇబ్బంది ఏమిలేదు పెంచేస్తామని హామీ ఇచ్చి తప్పారని విద్యార్థులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో వెటర్నరీ హౌస్‌సర్జన్ విద్యార్థులకు రూ.24వేలు, ఉత్తరప్రదేశ్‌లో రూ.23,500, పశ్చిమబెంగాల్‌లో రూ.20 వేలు, కేరళలో రూ.20వేలు, హర్యానాలో రూ.17వేలు, తమిళనాడులో రూ.14వేలు స్టైఫండ్ ఇస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు.

రోజుకు రూ.263 మాత్రమే పడుతుంది..



ఈ రోజు రాష్ట్రంలో నైపుణ్యం లేని వ్యక్తికి కూలి రూ.500 వరకు చెల్లిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో రూ.400వరకు ఇస్తున్నారు. మాకు మాత్రం ప్రస్తుత స్టైఫండ్ ప్రకారం వచ్చేది రోజుకు రూ.263 మాత్రమే. ప్రభుత్వం మా సమస్యను అర్థం చేసుకుని న్యాయం చేయాలి. ఒకటి రెండు మార్కుల తేడాతో మాత్రమే మేము మెడిసిన్ సీట్లు కోల్పోయాం. నోరు లేని మూగజీవాలకు సేవ చేయాలని ఈ కోర్సు చదివాం. ఇందులో చాలా ఇబ్బందులు ఉన్నాయి. ప్రాణాలు పోయే పరిస్థితి కూడా ఉంది.

- భాగం దత్తాత్రేయ, హౌస్ సర్జన్


జంతువులకు వైద్యం ఈజీ కాదు



మా దగ్గరకు చాలా ప్రమాదకరమైన జంతువులు వస్తుంటాయి. ఏ చిన్న పొరపాటు జరిగినా అవి మా మీద దాడి చేస్తాయి. జంతువులకు వైద్యం చేయడం చాలా కష్టం. ఒక్కోసారి అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయి. అయినా ఈ వృత్తిని ఎంచుకోవటం సాహసమే. ప్రభుత్వం స్టైఫండ్ విషయంలో మాపై జాలి చూపాలి.

- దేవర రేవతి, హౌస్ సర్జన్

మేము చదివింది అవే సబ్జెక్ట్‌లు



ఎంబీబీఎస్ వాళ్ళు ఏ సబ్జెక్టులు అయితే చదువుతారో మాకు అవే ఉంటాయి. కాకపోతే వాళ్ళు మనుషులను బాగు చేస్తారు. మేం పశువులను బాగు చేస్తాం. మాకు స్టైఫండ్ ఇచ్చే విషయంలో చాలా చిన్నచూపు చూస్తున్నారు. మేం ఉన్నది చాలా తక్కువ మందిమి. ప్రభుత్వం ఇకనైనా మాకు స్టైఫండ్ పెంచేలా ఉత్తర్వులు జారీ చేయాలి.

- తాడికొండ చంద్రిక, హౌస్ సర్జన్



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వ్యూ

రెండో ఏడాదీ ధర్మకర్తల మండలి లేకుండానే శింగరకొండ వార్షిక తిరునాళ్ల

- వైసీపీ పాలనలో 15నెలలపాటు జరగని కమిటీ నియామకం
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఆలస్యం

అద్దంకి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వార్షిక తిరునాళ్ల రెండో ఏడాది కూడా ధర్మకర్తల మండలి లేకుండానే జరగనుంది. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల వార్షిక తిరునాళ్ల ఈ నెల 14వ తేదీన జరగనుంది. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి గడువు 2023 మార్చిలో ముగిసినా వైసీపీ ప్రభుత్వంలో కూడా అప్పట్లో కొత్త కమిటీ వేయకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆశావాహులు తీవ్ర ప్రయత్నాలు చేసి కూడా చివరకు నిరుత్సాహానికి గురయ్యారు. కోట శ్రీనివాసకుమార్ 2023 మార్చి వరకు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కొనసాగారు. అనంతరం సుమారు సుమారు 15 నెలల తరువాత సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకు కూడా కొత్త కమిటీ నియామకం జరగలేదు. లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి మాత్రం గత ఏడాది జూలై వరకు కొనసాగింది. గత వార్షిక తిరునాళ్ల కూడా ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి లేకుండానే నిర్వహించగా, కూటమి ప్రభుత్వం వచ్చి కూడా 9 నెలలు కావస్తున్నా ఇంకా ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండళ్లకు పలువురు నేతలు ప్రయత్నాలు చేసినప్పటికీ ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవుల భర్తీ జరగకపోవడంతో ఆలస్యం అయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 14వ తేదీ జరిగే వార్షిక తిరునాళ్ల కూడా రెండు దేవాలయాలకు కమిటీలు లేకుండానే జరగనుంది.

అన్ని రంగాల అభివృద్ధికి కృషి

ఎంపీ కృష్ణప్రసాద్



పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలోని అన్ని రంగాలనూ అభివృద్ధి చేసేందుకు కచ్చితంగా కృషి చేస్తామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో నిలిచిన అభివృద్ధి పనులను లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడి పరిస్థితులు, స్థితిగతులపై అధికారులతో మాట్లాడారు. వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అలాగే నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ కూటమి నాయకులతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎంపీ వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముగిసిన మినీ ప్రాజెక్టు ఎక్స్‌పో



మినీ ప్రాజెక్టు ఎక్స్‌పోను పరిశీలిస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం దిగ్విజయంగా మినీ ప్రాజెక్టు ఎక్స్‌పో ముగిసింది. ఈసందర్భంగా కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఈఈఈ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆధునిక టెక్నాలజీపై 17 రకాల ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జగదీష్, కోఆర్డినేటర్ అరుణ్ పాల్గొన్నారు.

నేడు సరస్వతీదేవి విగ్రహానికి గొడుగు నిర్మాణం



హైస్కూల్‌ను పరిశీలించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం స్కూల్‌ను పరిశీలించారు. ఈక్రమంలో గతంలో స్కూల్ ప్రాంగణంలో నిర్మించిన సరస్వతీదేవి విగ్రహానికి గొడుగు నిర్మించాలని తీర్మానించారు. ఈక్రమంలోనే సుమారు రూ.50వేలు వరకు చందాలు పోగుచేసినట్లు వివరించారు. నిర్మాణానికి సంబంధించి ఆదివారం ప్రముఖులతో పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గోశాలకు గడ్డి నిమిత్తం రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురు ప్రసాద్, సురేష్, నారాయణమూర్తి, నాగేశ్వరరావు, నారాయణ, ప్రసాద్, సాంబశివరావు, పూర్ణ, రమేష్, రవిచంద్ర పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలతో మేలు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వలన ఆరోగ్యంగా ఉండడంతో పాటు తద్వారా వచ్చే ఆదాయం లాభసాటిగా ఉంటుందని ఏరియా పశు సంవర్ధకశాఖ వైద్యుడు సజ్జా చిట్టిబాబు అన్నారు. పశువులలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు శనివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 4నెలలు పైబడిన దూడ నుంచి అన్ని రకాల ఆవులు, గేదెలకు అందుబాటులో ఉన్న సిబ్బంది ద్వారా వేయించాలని సూచించారు.

రూ.95 కోట్ల పొదుపు నిధులు బూడిదపాలు

- గత వైసీపీ అధికార దర్పంతో ఆసరా అధోగతి
- జిల్లాలో పార్టీ అనుయాయులు, వర్గీయులకు కేటాయింపు
- దయనీయంగా స్వయం సహాయక సంఘాలు



సమావేశమైన పొదుపు సంఘాల సభ్యులు (ఫైల్)

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల నిధులను గత వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. ఏకంగా రూ.95కోట్లు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. అధికారంలో ఉండగా, ఆసరా పథకం ద్వారా బాపట్ల జిల్లాకు రూ.95 కోట్లను గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేసింది. అంతవరకు బాగానే ఉన్నా పరిపాలనాలోపంతో పాటు అధికార దుర్వినియోగానికి పాల్పడింది. విడుదల చేసిన నిధులు ఉపాధి కూడగట్టుకునే పొదుపు సంఘాలకు కాకుండా వైసీపీ అనుయాయులకు, మద్దతుదారులకు అందించింది. ఈక్రమంలో లబ్ధి పొందిన వారు ఉపాధి యూనిట్లు, వ్యాపారాలు నిర్వహించకుండా అవసరాలకు వాడుకున్నారు. దీంతో తీసుకున్న రుణానికి నేడు వడ్డీ లేదు కదా అసలు కట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. దీంతో ప్రస్తుతం నిజంగా రుణ సాయం పొందాల్సి ఉన్న పొదుపు మహిళల పరిస్థితి దయనీయంగా మారింది. వ్యాపారాలు చేయని రుణ గ్రహీతలు తిరిగి చెల్లింపుల్లో మొండికేసేవారు. దీంతో ప్రస్తుతం ఆసరా నగదుకు సంబంధించి జిల్లా సమాఖ్యలో చిల్లి గవ్వ కూడా లేకుండా పోయింది. దీనిపై అధికారులు సక్రమమైన విచారణ జరిపించి నిజమైన పొదుపు సంఘాలకు రుణాలు కేటాయించడంతో పాటు తీసుకున్న నగదుపై విచారణ జరపాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

యూనిట్లు ఏర్పాటు కాలేదు



గతంలో ఆసరా యూనిట్లు ఏర్పాటు కాలేదు. అందించిన నగదును రుణ గ్రహీతలు ఆర్థిక పరమైన అవసరాలకు వినియోగించుకుని ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో సమాఖ్య ఖాతా జీరో అయింది. ప్రస్తుతం విజన్ 2047 ద్వారా యూనిట్‌లు కల్పించి ప్రతి ఇంట్లో వ్యాపార వేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాము. ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్తను తయారు చేయడమే ధ్యేయం

- పద్మ, డీఆర్‌డీఏ పీడీ

రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

అద్దంకి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఎంతో నిష్ఠగా చేసే ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలోని ముస్లింలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాసం ఆధ్యాత్మికపరమైనదే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. భగవంతుని ఆశీస్సులు తప్పక లభిస్తాయన్నారు.

తారు రోడ్ల నిర్మాణానికి రూ.6.84 కోట్లు మంజూరు

అద్దంకి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 4 తారు రోడ్లు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా 6.84 కోట్ల రూపాయలు మంజూరైనట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలంలో నామ్ రోడ్డు నుంచి గోవాడ వరకు1.20 కోట్ల రూపాయలు, బల్లికురవ మండలం వైదన నుంచి చెన్నుపల్లి వరకు 3 కోట్ల రూపాయలు, సంతమాగులూరు మండలం సజ్జాపురం రోడ్డు కు 1.20 కోట్ల రూపాయలు, కొరిశపాడు మండలం లో మేదరమెట్ల నుంచి తమ్మవరం వరకు 1.44 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు.

మహిళల భద్రత ప్రతి పౌరుడిది



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్



ఓపెన్‌హౌస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బరాజు

డీఎస్పీ మొయిన్

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత ప్రతి పౌరుడిపై ఉందని, అలాంటి వాతావరణం సమాజానికి మేలుకరమని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. మహిళా దినోత్సవాల సందర్భంగా ఈపూరుపాలెం గ్రామంలో విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో స్టేషన్ పరిధిలోని ఉమెన్ పోలీసులకు, సచివాలయాల పరిధిలోని సచివాలయ మహిళా పోలీసులకు, విద్యార్థినులకు గోరంట్ల సూపర్ స్పెషాలిటీ సహకారంతో మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. శనివారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ అభిషేక్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వేటపాలెంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్, మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలి

అద్దంకి : మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ప్రారంభం సందర్భంగా శనివారం పోలీస్ స్టేషన్‌లో 110 మంది మహిళలకు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ హేమామాధురి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి సుబ్బరాజు వివరించారు. ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఓపెన్ హౌస్ సందర్శనలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ పరిశీలించారు. సీఐ పోలీస్ స్టేషన్ గురించి అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలు లకు అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఎదగాలి

పంగులూరు : బాల్యంలో బాల బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఎదగాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బాలరాజేశ్వరి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా పంగులూరు ఉన్నత పాఠశాలలో పోలీసులు శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల బాల బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యం పట్ల బాలబాలికలకు డాక్టర్ బాల రాజేశ్వరి అవగాహన కల్పించారు. సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, చదువు, ఆటలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, ఎస్‌ఐ వినోద్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో..

బల్లికురవ : మహిళా దినోత్సవంలో భాగంగా పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం చెన్నుపల్లిలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ మహిళలకు, చిన్నారులను పరీక్షించి, మందులు అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఐ జీవీ చౌదరి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ప్రత్యేక పాత్ర ఉందని అందరూ మహిళను గౌరవించాలని కోరారు. అలానే ప్రజలు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థినులకు పోలీసు స్టేషన్‌ను చూపించి చట్టాలపై అవగాహన కల్పించారు.

బాలికలతో ర్యాలీ

యద్దనపూడి (మార్టూరు) : మహిళా వారోత్సవాలలో భాగంగా శనివారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన మహిళ ఇంటి వద్ద ఆడపిల్ల పేరుమీద మొక్కను నాటారు. ఇంకా గ్రామంలో కవలపిల్లలకు జన్మనిచ్చిన మహిళ ఇంటి వద్ద వారికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు శ్యామసుందరి,ఐసిడిఎస్ సూపర్ వైజరు సుజాత,కార్యకర్తలు పీనాగరాజ, త్రివేణికె సుజాతమ్మ, పీ సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

రుణ సాయంతో ఉపాధికి కృషి

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు రుణ సాయం అందించి, ఉపాధితో ఆర్థికంగా ముందుకు సాగేందుకు నిరంతరం యూనియన్ బ్యాంక్ కృషి చేస్తుందని ఒంగోలు డిప్యూటీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ సాంబశివరావు అన్నారు. శనివారం పట్టణంలోని చీరాల శాఖ కార్యాలయాన్ని అధికారులు సందర్శించారు. సోమవా రం పద్మశాలీయ కల్యాణ మండపంలో చిన్న, పెద్ద తరహా వ్యాపారులకు రుణాలు మంజూరుతో పాటు బ్యాంకు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల పరిధిలోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌లు యొహోషువ, వెంకట రవీంద్ర, సోమయ్య పాల్గొన్నారు.

సివిల్ సర్వీసులపై విద్యార్థులకు అవగాహన

అద్దంకిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వృక్షశాస్త్రం విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ విద్యార్థులకు సివిల్స్ గ్రూప్ పరీక్షలు, ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కార్యక్రమం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎన్. వెంకటరమణ హాజరై విద్యార్థులకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసుల ప్రాధాన్యత, పరీక్ష విధానం, వ్యక్తిగత శ్రద్ధ, కృషితో పాటు ఇతర పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అతిథిని శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, అశోక్‌కుమార్, మస్తాన్‌వలి, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

మసీదుల్లో ప్రార్థనలకు ఏర్పాట్లు

పామూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పవిత్ర ఖురాన్ గ్రంధం అవతరించిన పవిత్ర మాసం రంజాన్. శనివా రం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో ఆదివారం నుంచి రంజాన్ ఉపవాసాల నిర్వహణకు ముస్లింలు సన్నాహాలు ప్రారంభించారు. నెలరోజుల పా టు కఠన ఉపవాసాలు ఆచరిస్తారు. ప్రతిఒక్కరూ అల్లాహ్ ఆదేశానుసారం రోజా (ఉపవాసం)ఉంటూ ఆ యన చూపిన మార్గంలో పయనించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తారు.

రంజాన్ నెల ప్రారంభం నుంచి ప్రతిరోజు తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఉపవాస దీక్ష ప్రారంభానికి అవసరమైన ఆహార పదార్థాలను తయా రు చేసుకుంటారు. కుటుంబసభ్యులందరూ ఒకచోట చేరి భక్తి పూర్వకంగా సెహరి స్వీకరిస్తారు. దీక్ష ప్రారంభసమయం ముగియగానే ప్రార్థనల కోసం సమీప మసీదులలోకి వెళ్లి తమ పాపాలను క్షమించాలని అ ల్లాహ్‌ను వేడుకుంటారు. తమ ఉపవాసాలకు తగిన ప్ర తిఫలం ఇవ్వాలని, రంజాన్‌నెల పుణ్యఫలాలను దక్కేలా చూడాలని వేడుకుంటూ విస్తార్ (ఉపవాస దీక్ష విర మణ) చేస్తారు. రాత్రి ఇషా నమాజ్ తరువాత తరావీ ప్రత్యేక ప్రార్థనలకు ఆయా మసీదు నిర్వాహణ కమిటీ లు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఈసందర్భంగా పట్టణంలోని ఐదు మసీదులతో పాటు, మండలంలోని నుచ్చుపొద, మోపాడు, లక్ష్మీ నరసాపురం, కందువారిపల్లి, వగ్గంపల్లి గ్రామాల్లోని మసీదులకు రంగులు వేయించి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.



ఆన్‌లైన్ అమ్మకాలపై డ్వాక్రా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ పద్మ (ఫైల్)

డ్వాక్రా @ ఈ-కామర్స్

(5వ పేజీ తరువాయి)

ఓఎస్‌డీసీ పోర్టల్‌లో ఉంచారు. ఈ వేదిక ద్వారా డ్వాక్రా ఉత్పత్తులను బుక్ చేసుకునే వినియోగదారులపై అదనపు భారం పడకుండా డెలివరీ చార్జీలను ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలతో పోల్చుకుంటే చౌకగా వస్తువులు దొరికే వీలున్నందున భవిష్యత్‌లో పెద్దఎత్తున డ్వాక్రా ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరగడం ఖాయమనే ఆశాభావాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. ఈ ప్రక్రియపై ప్రజల్లో ప్రచారం కల్పించాల్సి ఉంది. దిగ్గజ కంపెనీల ఉత్పత్తులన్నీ బ్రాండ్‌ను ప్రమో ట్ చేసుకుంటూ పెద్దఎత్తున ఆన్‌లైన్ వాటాను చేజిక్కించుకున్నాయి. ఓ అంచనా ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికల మీద ఇంటి అవసరాలకు ఉపయోగపడే సామగ్రిపై రోజుకు జరిగే వ్యాపారం అక్షరాల రూ.4 కోట్లుగా లెక్క తేల్చారు. ఈ పోటీని తట్టుకుని డ్వాక్రా మహిళలు నిలబడడానికి ప్రభుత్వం ఇచ్చే ఊతానికి తోడు వారు కూడా అవగాహన తెచ్చుకోవడంతో పాటు వినూత్న పద్ధతులలో తమ ఉత్పత్తులను ప్రమోట్ చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా ఇలా...

బాపట్ల జిల్లాలో 1024 గ్రామైక్య సంఘాలలో 33,430 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో 1050 సంఘాలకు 35,000 మంది, గుంటూరు జిల్లాలో 575 సంఘాలలో 16,500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆయా గ్రామైక్య సంఘాల నుంచి ఆసక్తితో పాటు ప్రాథమికంగా ఆన్‌లైన్‌పై అవగాహన కలిగిన వారిని ఎంపిక చేసి ఎంటర్‌ప్రెన్యూర్లుగా డీఆర్‌డీఏ రిజిస్ట్రేషన్ చేసింది. ఒక్క బాపట్ల జిల్లాలోనే వీరి సంఖ్య 693గా ఉండగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే 2,800గా ఉంది. ఇప్పటికే ఆన్‌లైన్ వేదికగా జరిగిన లావాదేవీల మొత్తం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే రెండు లక్షల దాకా ఉన్నట్లు యంత్రాంగం చెబుతోంది. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి నాణ్యతతో ఉత్పత్తులు తయారు చేస్తున్నా మార్కెటింగ్ అవకాశాలు లేక ఇబ్బందులు పడిన తమకు కూటమి ప్రభుత్వం తీసుకున్న స్మార్ట్ నిర్ణయంతో లబ్ధి చేకూరనున్నదని డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటి పథకాలకు నిధులు

(5వ పేజీ తరువాయి)

30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసింది. ఏఐఐబీ ఇచ్చే రుణంను కేంద్ర ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుంది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వాడేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన 30 శాతం నిధుల మాట ఎలా ఉన్నా రుణం నిధులను దారి మళ్లించడంతో పథకాలు నిలిచిపోయాయి. ఐదేళ్ల తాగునీటి పథకాల విస్తరణ పనులపైన, ప్రజల తాగునీటి ఇబ్బందులపైన వైసీపీ పాలకులు దృష్టి సారించలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపాల్టీలలో తాగునీటి సమస్యలు పరిష్కారిస్తామని, తాగునీటి పథకాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన తర్వాత ఆ పనులపై దృష్టి సారించింది. అయితే ఏఐఐబీ పథకం గడువు పూర్తి కావడంతో సదరు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీని స్థానంలో యుఐడీఎఫ్ పథకం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో కూడా 70 శాతం రుణం.. 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనంగా నిధులు మంజూరు చేశారు.

పెరిగిన వ్యయం

ఐదేళ్లుగా తాగునీటి పథకాల విస్తరణ పనులు నిలిచిపోవడంతో వ్యయం పెరిగింది. కొత్త రేట్ల ప్రకారం నీటి పథకాలకు వ్యయం అంచనాలను పబ్లిక్ హెల్త్ శాఖ రూపొందించింది. ఈ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నీటి నిల్వ చెరువుల ఆధునీకీకరణ, పైపులైన్ల నిర్మాణం, నీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధి ప్లాంట్ల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. గృహాలకు నీటి సరఫరా కోసం డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మిస్తారు. మాచర్లలో సుమారు రూ.55 కోట్లతో పనులు చేపట్టగా 10 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. పిడుగురాళ్లలో రూ.102 కోట్లతో పనులు చేపట్టగా 20 శాతం కూడా పూర్తి కాలేదు. వినుకొండలో రూ.138 కోట్లతో చేపట్టిన పనులు ముందుకు సాగడంలేదు. ఇక్కడ కూడా 20 శాతం లోపే పూర్తయాయి. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయకపోవడంతో దాదాపు రూ.141 కోట్లుగా వ్యయం పెరగడం గమనార్హం. ఇదే పరిస్థితి గుంటూరు కార్పొరేషన్ సహా మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి మున్సిపాల్టీల్లో నెలకొంది.

మునిసిపల్ కార్మికుల గోడు పట్టించుకోవాలి

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగేళ్లుగా మునిసిపల్ కార్మికులు పడుతున్న అవస్థలు పట్టించుకోవాలని పలువురు ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) చీరాల నాయకులు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గతంలో ధర్నా చేసిన సమయంలో చర్చలు జరిపిన గత ప్రభుత్వం జీతాలు చెల్లించనున్నట్లు ఆదేశాలు ఇచ్చారు. కానీ అమలు జరగలేదు. నిత్యం శ్రమపై ఆధారపడి జీవించే వారి గోడు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోటి దాసు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, బాపట్ల శ్రీనివాసరావు, మాల్యాద్రి, సురేష్, సుబ్బారాయుడు, ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి రూ.57.47 కోట్లు మంజూరు

- జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గానికి నిధులు

మంత్రి గొట్టిపాటి

అద్దంకి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జల జీవన్ మిషన్ ద్వారా అద్దంకి నియోజకవర్గంలోని గ్రామాలలో రక్షిత తాగునీటి సరఫరా, ఆర్వో ప్లాంట్ల నిర్మాణం, పైప్‌లైన్ల ఏర్పాటు, ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు తదితర పనులకు రూ.57.47కోట్లు మంజూరైనట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో గ్రామాలలో దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచినా పేదలకు మంచినీళ్లిచ్చే ప్రాజెక్టులకు మ్యాచింగ్ గ్రాంట్లు కూడా విడుదల చేయలేదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జలజీవన్ మిషన్ జీవం కూడా తీసేశారన్నారు. కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ లక్ష్యాలు చేరుకుంటుందన్నారు. పల్లె పండుగ ద్వారా గ్రామాల రూపురేఖలు మారుతున్నామని రవికుమార్ అన్నారు.

అనంతవరం చెరువుకు బొప్పూడి లిఫ్ట్ నీరు



బండోడి చెరువుకు తాగునీటిని మళ్లించేందుకు కాలువ తీస్తున్న ఎక్స్‌కవేటర్

ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో అధికారుల చర్యలు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముందు చూపుతో వ్యవహరించడంతో యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో గ్రామస్థులు తాగునీటికి ఉపయోగించే బండోడి చెరువుకు శుక్రవారం నుంచి తాగు నీరు చేరుతోంది. దాంతో ఈ వేసవిలో గ్రామంలో తాగునీటికి ఇబ్బంది ఉండవని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా గ్రామంలో ప్రజలందరూ తాగునీటికి వినియోగించే బండోడి చెరువులో గత 10 రోజుల కిందటే నీళ్లు అడుగంటిపోయాయి. అయితే ఈ చెరువులోకి యద్దనపూడి బ్రాంచి కెనాల్ నుంచి నూతలపాడు మైనర్ కాలువ ద్వారా సాగర్ జలాలు వచ్చే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం సాగర్ జలాలు సమృద్ధిగా రాకపోవడంతో బండోడి చెరువుకు నీళ్లు చేరే విషయంపై ప్రత్యామ్నాయ మార్గాలను టీడీపీ గ్రామ నాయకులు గుదే తారకరామారావు, కొరటాల వంశీతో పాటు పలువురు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని బొప్పూడి లిఫ్టునుండి తమ గ్రామంలోని చెరువుకు నీళ్ల చేరే అవకాశాలు ఉన్నాయని, గతంలో కొన్నేళ్ల కిందట ఇదేవిధంగా చెరువుకు నీళ్లు పెట్టామని నాయకులు ఎమ్మెల్యే ఏలూరికి తెలియచేశారు. దాంతో ఏలూరి ఈ విషయమై పరిశీలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్ చంద్రను ఆదేశించారు. తరువాత డీఈ సతీష్ చంద్ర వెంటనే రంగంలోకి దిగి గ్రామ నాయకులను తీసుకొని బొప్పూడి లిఫ్ట్ వద్దకు వెళ్లి పరిశీలించారు. తదనంతరం ఈ లిఫ్టు నుంచి పసుమర్తి సమీపంలోని ఒక చెరువుకు నీటిని పంపిస్తే అక్కడి నుంచి బండోడి చెరువుకు నీళ్లు చేరడానికి తాత్కాలికంగా ఎక్స్‌కవేటర్‌తో కాలువను తవ్వించారు. ఈ నేపథ్యంలో చెరువుకు నీళ్లు చేరుతున్నాయి. దాదాపుగా 10 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన చెరువులో వారం రోజుల పాటు నీళ్లను పెట్టినట్లయితే ఈ ఎండా కాలంలో గ్రామంలో మంచి నీటి ఎద్దడి ఉండదని గ్రామస్థులు అంటున్నారు.

ముందస్తుగా ఎమ్మెల్యే ఏలూరి అధికారులను అప్రమత్తం చేయడంతో అనంతవరం గ్రామానికి వేసవి కాలంలో తాగునీటి బెడద తొలగిందని గ్రామస్థులు అంటున్నారు.



ఫేర్‌వెల్ సభలో మాట్లాడుతున్న హెచ్ఎం హనుమంతురావు

ఇష్టంతో కష్టపడి చదవాలి

బల్లికురవ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఉన్నత పాఠశాల హెచ్ఎం హనుమంతురావు కోరారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దిగువ తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు చదువులో ఉన్నతంగా ముందుకు సాగేలా ఉపాధ్యాయులు వారికి సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను కేరింతల మధ్య నిర్వహించారు. పాఠశాల విద్యార్థులందరూ కార్యక్రమంలో ఆనందంతో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ మల్లికార్జునరావు

పంగులూరు. మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సైబర్ నేరాలు పెరిగాయని, ప్రజలు సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని చందలూరు గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీస్ అధికారులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. లాటరీ పేరుతో, నగదు ప్రోత్సాహకాలతో, బ్యాంక్ ఎకౌంట్లల ఆన్‌లైన్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌కు తొందరపడి స్పందించడం మంచిది కాదన్నారు. కొత్త నెంబర్లతో వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించి మోసపోవద్దని, సైబర్ మోసాలకు గురైన సందర్భంలో వెంటనే 1930 నెంబరుకు సమాచారం ఇవ్వావలని సూచించారు. మహిళల భద్రతపై పోలీస్ చర్యలను వివరిస్తూ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌బాబు, నాయకులు రామలింగస్వామి, మురకొండ సుబ్బారావు, అడ్డగడ సుబ్బయ్య, కందిమళ్ల రామాంజనేయులు, పెంట్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్‌తో నేతలు, అధికారులు

క్రమం తప్పకుండా చెత్తను తరలించాలి

పంగులూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ పరిధిలో నిత్యం చెత్తతో కూడిన వ్యర్థాలను సేకరించి క్రమం తప్పకుండా డంపింగ్ యార్డుకు తరలించాలని టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు సూచించారు. స్వచ్ఛభారత్ నిధులతో ముప్పవరం గ్రామ పంచాయతీకి సమకూర్చిన ట్రాక్టర్‌ను ఏడుకొండలు, స్థానిక నేతలు శనివారం ప్రారంభించారు. గ్రామంలోని నివాస గృహాలు, ఇతర ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను సంపదగా తీర్చిదిద్దాలన్నారు. మండలంలో ప్రధాన కూడలిగా ఉన్న ముప్పవరం గ్రామ పంచాయతీ అవసరాలను గుర్తించి స్వచ్ఛభారత్ ద్వారా వాహనం సమకూర్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రౌతు సాంబశివరావు, టీడీపీ నాయకులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, కార్యదర్శి బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ జ్వరాలు దూరం



మణికేశ్వరంలో మురుగును పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ గోపీనాథ్

అద్దంకిటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు పాటించడం వలన సీజనల్‌గా వచ్చే జ్వరాలకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ గోపీనాథ్ అన్నారు. శనివారం మండలంలోని మణికేశ్వరం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆరోగ్య కేంద్రం వద్ద, మురుగు కాలువలలో, ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వలు ఉండడాన్ని పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వలు ఉండడం వలన దోమల వ్యాప్తి పెరిగి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గున్యా, డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటి బారిన పడకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట డాక్టర్ హరికృష్ణ, మల్లిక, ఏఎన్ఎం శిరోమణి, టీడీపీ నేతలు కరిముల్లా, బడావలి, మీరావలి, ఆదినారాయణ, బలరామిరెడ్డి, సుధాకర్, మౌలాలి, పకీర్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణతో మెలగాలి



సభావేదికపై మాట్లాడుతున్న యద్దనపూడి ఎంఈవో గోపి

మార్టూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువును కొనసాగించినపుడే కోరుకున్న స్థాయికి ఎదుగుతారని యద్దనపూడి ఎంఈవో చిలుకూరి గోపి అన్నారు.శనివారం మార్టూరులోని రాయల్ హైస్కూల్లో 10వతరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకను నిర్వహించారు.స్కూలు చైర్మన్ పీ రవీంద్రబాబు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఈవో గోపి విచ్చేశారు. సభావేదికపై గోపి మాట్లాడుతూ జీవితంలో 10 వతరగతిలో సాధించే మార్కులు ఉన్నత స్థాయికి చేరడానికి గీటురాయిగా ఉంటాయన్నారు. ఉన్నత చదువులు చదవటానికి విద్యార్థులు 10 వతరగతి లోనే ఒ క అవగాహనకు రావాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్డులకు ఆయన చేతులమీదగా బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రావుల బాపయ్య,మదుబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాన

అద్దంకిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కలిగి, వాటికి బానిసలు కావొద్దని కళాశాల ప్రిన్సిపాల్ లాజరస్ బాబు అన్నారు. శనివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాలలో ఏర్పాటు చేసిన క్లబ్‌లో విద్యార్థులు, అధ్యాపకులను భాగస్వాములను చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జనల్ హెచ్‌వోడి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజకుమార్, కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి పథకాలు అమలు చేస్తున్నాం

ఎంపీ కృష్ణప్రసాద్



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, పక్కన ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, అధికారులు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని, జగన్‌రెడ్డిలా మాయ మాటలు చెప్పడం లేదని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం చీరాల పరిధిలోని జాండ్రపేట, పేరాలలో ఎంపీ కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వృద్ధులకు ఇచ్చిన మాట తప్పిందన్నారు. రూ.1000కి పింఛన్ పెంచుతున్నట్లు చెప్పిన జగన్‌రెడ్డి ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ మోసగించిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వెంటనే రూ. వెయ్యి పెంచడమే కాకుండా ప్రకటించిన తేదీ నుంచి రెండునెలల పింఛన్ అందజేసిందని తెలిపారు. అనంతరం ప్రజల సమస్యలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తదితర అధికారులతో పాటు పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



టీస్టాల్ వద్ద ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచిస్తున్న ప్రత్యేకాధికారి బాలమ్మ

పంగులూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నట్లు నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.బాలమ్మ అన్నారు. పంగులూరు, రామకూరు గ్రామాలలో సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమెతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు శనివారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సక్రమంగా అందుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. పింఛన్‌ల పంపిణీలో సిబ్బంది అలసత్వం వహించవద్దన్నారు అనంతరం పంగులూరు ప్రధాన కూడలిలో టీ దుకాణాలు, టిఫెన్ హోటల్స్‌ను సందర్శించి క్యాన్సర్ కారకాలైన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ పేపర్లు వినియోగించవద్దని సూచించారు. వీరి వెంట ఎంపీడీవో స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శులు రాంబాబు, శిరీష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : మండల పరిధిలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి పరిశీలించారు. చినగంజాం, కడవకుదురు, గొనసపూడి, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లో జరుగుతున్న పెన్షన్ పంపిణీని ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలో 5845 మంది పెన్షన్‌దారులకు గాను 5558 మందికి పెన్షన్ పంపిణీ చేసి 96శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి సోమవారం అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

103మంది గైర్హాజర్

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 2,588 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావా ల్సి ఉండగా, 2485 మంది మాత్రమే హాజరయ్యారు. 103 మంది గైర్హాజరయ్యా రు. చీరాల పరిధిలో విజ్ఞాన భారతి, శ్రీమేధావి, ఉమెన్స్, శ్రీ విద్యా, ఏకేపీ, వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్, శ్రీ గౌతమి, వేటపాలెం పరిధిలో బండ్ల బాపయ్య కళాశాలలు పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. ఈక్రమంలో ఆయా కేంద్రాల వద్ద అధికారులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

అయితే తిమ్మసముద్రంకు చెందిన విద్యార్థి హరికృష్ణ పరీక్ష రాసేందుకు చీరాల వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై గా యపడ్డాడు. స్థానికులు హరికృష్ణకు ఏరియా ఆసుపత్రిలో చికిత్సను అందించగా కేంద్రానికి ఆలస్యంగా వెళ్లాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న అధికారులు పరీక్షకు అనుమతి కల్పించారు.

అద్దంకిటౌన్ : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. అద్దంకిలో శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 1,020 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 977 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ ఎం.వీరాంజనేయులు తెలిపారు.

బల్లికురవ :జూనియర్ కళాశాలలో జరిగిన మెదటి సంవత్సర ఇం టర్ పరీక్షలకు 135 మందికి గాను 20 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ రవింద్రబాబు తెలిపారు.

ఇంకొల్లు : రెండు పరీక్షా కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మొత్తం 33 మంది గైర్హాజరయ్యారు. డీఎన్ఎం జూనియర్ కళాశాలలో 158 మందికి గాను 144 మంది, డ్రీమ్స్ కళాశాలలో 202 మందికి గాను 183 మంది పరీక్షకు హాజరయ్యారు.

మార్టూరు : ఇంటర్ మొదటి సంవత్సరపరీక్షలు రెండు కేంద్రాలలో ప్రశాంతంగా మొదలయ్యాయి. ఆయా కేంద్రాల వద్ద నిర్వాహకులు అన్నివసతులను ఏర్పాటుచేశారు. వాటిలో మార్టూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 251 మంది విద్యార్థులకు గాను 232 మంది హాజరయ్యారు. శ్రీహర్షిణి కాలేజీలో 287 మందికి 265 మంది హాజరయ్యారు. పోలీ బందోబస్తు నిర్వహించారు.

సంతమాగులూరు : జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 153 మందికిగాను 151 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

పర్చూరు : ఇంటర్ పరీక్షలు స్థానిక బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కళాశాలలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. 10 మంది విద్యార్థులు గైర్హాజ రైనట్లు నిర్వాహకులు సునీత తెలిపారు.



చీరాల ఏకేపీ కాలేజీ వద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు



అద్దంకి పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాల పరిశీలన



బల్లికురవ-సంతమాగులూరు రోడ్డులో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన రెవెన్యూ పరిధిలో బల్లికురవ సంతమాగులూరు రోడ్డులో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని విశ్రాంత ఎంపీడీవో షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం చేపడుతున్న ప్రదేశాన్ని శనివారం తహసీల్దార్ రవినాయక్ పరిశీలించారు. అర్‌అండ్‌బీ రోడ్డు పక్కన గతంలో ప్రభుత్వం ఎస్టీలు, జర్నలిస్టులకు నివేశన స్థలాలను కేటాయించింది. వాటికి ముందు వైపున అర్‌అండ్‌బీ భూమిని ఆక్రమించుకొని పెద్దఎత్తున వ్యాపార సముదాయాలను కట్టడంపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణం చేస్తున్న భవనాలకు కొలతలు వేయగా రోడ్డు స్థలం 80 శాతం ఉండడంతో వెంటనే అర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం అందించి నోటీసులు జారీ చేయిస్తామని తహసీల్దార్ తెలిపారు. రోడ్డుపక్కన నీరు కూడా పోకుండా కాలవను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేయడం ఏమిటని భవన యజమానిని ఆయన ప్రశ్నించారు. రెండేళ్ల కిందట కూడా దుకాణాల పనులు మెదలుపెట్టగా అప్పట్లో అధికారులు రోడ్డు భూమి అని మార్కింగ్ పెట్టగా కొంత కాలం పనులు నిలిపేసి మరలా ఇప్పుడు పకడ్బందీగా ఒక అంతస్తుతో దుకాణాలను నిర్మాణం చేస్తున్నారని పలువురు ఈసందర్భంగా ఆరోపించారు. ఈ పరిశీలనలో సర్వే డీటీ ప్రహర్ష, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ చంద్ర, పంచాయతీ కార్యదర్శి మీరావలి పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నేతలు

చీరాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈక్రమంలో అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. వర్గీకరణే లక్ష్యంగా ఎందరో అసువులు బాసినట్లు చెప్పారు. అయితే అందుకు సంబంధించి ప్రస్తుతం పూర్తిస్థాయిలో విజయం సాధించడం ఆనందదాయకమని వారు అన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య, డీ వందనం, అశోక్, అభిషేక్, రాంబాబు, వంశీ, చైతన్య పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా జాతి కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల త్యాగం మాదిగ జాతిలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఎంఆర్‌పీఎస్ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి తేల శ్రీనివాసరావు మాదిగ అన్నారు. శనివారం అంబేడ్కర్ భవనంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఇతర అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు పూనూరి రమేష్, సీనియర్ నాయకుడు పూనూరి నరేంద్ర, మండల అధ్యక్షుడు చక్రవర్తి, ఆంటోని, బుల్లియ్య, ఆమోస్ పాల్గొన్నారు.

బల్లికురవ : వర్గీకరణ కోసం ప్రాణ త్యాగం చేసిన మాదిగలకు శనివారం ఎంఆర్‌పీఎస్ నేతలు నివాళులర్పించా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ గొంతుక వినిపించేలా తమ ప్రాణాలను త్యాగం చేసిన వారిని ఎన్నటికీ మరవలేమని వారు తెలిపారు. కార్యక్రమంలో పేతూరు, సామ్యేల్, ఇజ్రాయల్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.3లక్షల విరాళం



నగదును అందజేస్తున్న భూచంద్రరావు, పక్కన శ్మశాన వాటిక కమిటీ ప్రతినిధులు సురేంద్రబాబు

పర్చూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో రూ.కోటి వ్యయంతో రూపుదిద్దుకున్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రవాశాంధ్రుడు దాతృత్వం చాటుకున్నారు. శ్మశానంలో షెడ్ నిర్మాణానికి సోమవారం రూ.3లక్షల నగదును కమిటీ నిర్వాహకులకు అందజేశారు. చల్లా వెంకటాచలం, ధర్మపత్ని కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రోజారావు సాయాన్ని అందించారు. కార్యక్రమంలో తులసి భువనేశ్వరరావు, తులసి శ్రీనివాసరావు, కఠారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి నరసింహం, లగడపాటి శంకర్, శ్రీనివాసరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

చెరువులో యువకుడి గల్లంతు



యువకుడి కోసం చెరువులో గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

పర్చూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండల పరిధిలోని పెదజూగర్లమూడి గ్రామ ఎస్సీకాలనీలోని చెరువులో యువకుడు గల్లంతైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. యువకుడు ఎవరు అనేది తెలియాల్సి ఉంది. చెరువులో యువకుడు మునిగిపోతున్నట్లు గుర్తించినవారు గ్రామస్థులకు సమాచారం అందించారు. విషయం తెలియడంతో పెద్ద ఎత్తున కాలనీవాసులు చెరువు వద్దకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రవికుమార్, పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి సారథ్యంలో చీరాల ఫైర్ సిబ్బంది నేతృత్వంలో రెస్క్యూ టీమ్ గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం చెరువు చుట్టూ భారీ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చుసి గాలింపు కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలంలో చెప్పులు వదిలి ఉండడం గమనార్హం.

టీడీపీ సీనియర్ నాయకుడు శివ మృతి

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పర్చూరుకు చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు పొన్నం శివ (62) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తెలుగు దేశం పార్టీకి శివ చేసిన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.